పెన్ పవర్
తెలంగాణ రౌండప్




# అప్రోచ్ రోడ్డు లేకుండానే..! హెచ్ఎండిఏ అనుమతులా..?

- ●మున్సిపల్ 'గిఫ్ట్ డీడ్' చేసిన స్థలంలో రుద్ర కన్స్ట్రక్షన్ 'కమాన్'.. సీసీరోడ్డు..?
- ●హెచ్ఎండిఏ పట్టించుకోదు..! దుండిగల్ సర్కిల్ వినిపించుకోదు..! దొందూ దొందే..!



దర్జాగా పనులు కొనసాగుతున్న వైనం..

- అటు 'గిఫ్ట్ డీడ్' రిజిస్ట్రేషన్.. ఇటు పనికిరాని ప్రైవేటు ఎంవోయూ..!
- అప్రోచ్ రోడ్డు లేకుండానే అనుమతుల మతలబేంటి..? ముడుపులేనా..?
- హైడ్రా విజిట్.. కేసుల నమోదుకు ఆదేశించినట్లు సమాచారం..!
- అయినా దుండిగల్ సర్కిల్--59లో చర్యలు శూన్యం..! కందకం తవ్వితే..?

- ●9,404.47 గజాల ఓపెన్ స్పేస్‌ను 2022 లోనే మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేశారు..
- ●తర్వాత, అదే స్థలాన్ని 2025లో ప్రైవేటు 'ఎంవోయు' చెల్లుబాటు అవుతుందా..?
- ●మున్సిపల్ ఆస్తిపై ప్రైవేటు ఒప్పందానికి చట్టబద్ధత కల్పించేది ఎవరు..?
- ●45 అడుగుల రహదారి అభివృద్ధికి ఏ నిబంధనల ప్రకారం 'ఎంవోయు'..?
- ●ఆ రహదారికి మున్సిపల్ అనుమతి ఉందా..? హెచ్ఎండీఏ ఆమోదించిందా..?
- ●మున్సిపల్ స్థలంలో నిర్మాణాలు జరుగుతుంటే..!అధికారులు ఏమయ్యారు..?
- ●అధికారులు 'విధులు' నిర్వర్తిస్తున్నారా..? 'నిధుల' వేటలో నిమగ్నమయ్యారా..?
- ●దుండిగల్ సర్కిల్-59 అధికారులు పనులు ఎందుకు అడ్డుకోలేకపోయారు..?



-4లో

ప్రజాప్రయోజనాలు ఆక్రమించి కమాన్-సీసీరోడ్డు నిర్మాణం..

## పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోండి..

- ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ..
- కుత్బుల్లాపూర్ తహశీల్దార్ బైరెడ్డి రాజేష్ పత్రికా ప్రకటన విడుదల..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియకు ప్రభుత్వం ప్రకటన జారీ..
- 2026 నవంబర్ 1, నాటికి మూడేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసి ఉండాలి..
- ఫారం-18 దరఖాస్తుకు.. డిగ్రీ/డిప్లొమా మార్కుల జాబితా కాపీ జత చేయాలి..
- 2026 నవంబర్ 6, దరఖాస్తుకు చివరి గడువు..
- ceotelangana.nic.in ద్వారా ఆన్‌లైన్‌లోనూ నమోదుకు అవకాశం..




-6లో

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు రామ్మోహన్‌రెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి

రాష్ట్రంలో జరగబోయే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేయనున్న అభ్యర్థులను ప్రకటించింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానం నుంచి సామ రామ్మోహన్‌రెడ్డి, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానం నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిలను రంగంలోకి దింపాలని నిర్ణయించింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో వీరిద్దరినీ ఎంపిక చేసినట్లు పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జి కేసీ వేణుగోపాల్ మంగళవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



సామ రామ్మోహన్‌రెడ్డి



రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన సామ రామ్మోహన్‌రెడ్డి గతంలో తెలంగాణ కాంగ్రెస్ మీడియా అండ్ కమ్యూనికేషన్ విభాగం ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రసార మాధ్యమాలు నిర్వహించే వివిధ చర్చా కార్యక్రమాల్లో పాల్గొంటూ పార్టీ, ప్రభుత్వ విధానాలను బలంగా సమర్థిస్తూ వస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి.. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుమారుడు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి దామోదర్ రాజనర్సింహల నేతృత్వంలోని కమిటీ సిఫార్సుల ఆధారంగా అధిష్ఠానం వీరిని ఎంపిక చేసింది. ఈ ఇద్దరు నేతలతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా మంగళవారం దిల్లీలో ఏఐసీసీ పెద్దలను కలిసిన తర్వాతే ఈ పేర్లు ఖరారు చేశారు. ప్రకటించే ముందు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌లతో ఫోన్‌లో మాట్లాడి అభిప్రాయాలు తీసుకున్నట్లు తెలిసింది. ఈ రెండు స్థానాలను రెండు వేర్వేరు సామాజికవర్గాలకు ఇవ్వాలనుకున్నా.. ప్రస్తుత ఎన్నికలు పార్టీ గుర్తులపై కాకుండా అభ్యర్థుల బలాబలాలపై ఆధారపడి జరగనున్నందున గెలిచే అభ్యర్థులనే బరిలోకి దింపాలని నిర్ణయించినట్లు తెలిసింది.



## ప్రభుత్వ భూమిలో.. అర్ధరాత్రి కబ్జాలు..!

- తహశీల్దార్ ఆదేశాలు.. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదుతో కేసు నమోదు..
- మట్టినింపిన టిప్పర్,చదును చేసిన జేసీబీని పట్టివేత..
- డ్రైవర్లపైనా చర్యలకు.. సూరారం పోలీసులకు ఫిర్యాదు..

-5లో

# అప్రోచ్ రోడ్డు లేకుండానే..! హెచ్ఎండిఏ అనుమతులా..?


SCANNED

32001/2022

भारतीय गैर न्यायिक

पचास रुपये रु.50 FIFTY RUPEES Rs.50

INDIA NON JUDICIAL

తెలంగాణ तेलंगाना TELANGANA

P 955874

CH. SWAPNA LICENCED STAMP VENDOR LIC. No.: 15-21-004/2014 Ren. No.: 15-21-014/2020 H.No. 201, Sri Krishna Nagar Colony, Gajularamaram, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dt. Ph:8333050286

S.No. 2605 Date 29/11/2022 Rs.

Sold to: Sama Rupavathy

S/o W/o D/o: Sama Ram Reddy

FOR WHOM: M/s R.R Developers

GIFT SETTLEMENT DEED FOR CHARITABLE PURPOSE GENERAL PUBLIC USE:

This Deed of Gift Settlement for public purposes General Public Use is made and executed on this the 29th day of November 2022 by and between:

M/s. R.R.DEVELOPERS (Partnership Firm) (Reg. No.2797/2012) (PAN AAPFR5566F), having registered Office at Plot No.161, Durga Vihar Colony, Tirumalgherry, Secunderabad - 500 015 (Partnership was originally constituted on 24th October 2012 with two partners, Later on Reconstituted on 8th April 2013 with five partners and Now as on latest Reconstituted on 3rd September 2013 with six partners), represented by its Managing Partner Smt. SAMA RUPAVATHY W/o. Sri SAMA RAM REDDY, aged about 54 years, Occupation: Business, Resident of LIG -31, APHB, Balaji Nagar, Kukatpally, Hyderabad - 500 072., (PAN: AHDPR2350Q, AADHAR: 3000 8062 9914), (authorized by all the Partners of Partnership vide Resolution dated 15th March 2015)

Hereinafter called the "DONOR" shall unless repugnant to the subject or context shall mean and include all its respective legal heirs, agents assigns, administrators, successors, legal representatives etc.,

For RR DEVELOPERS

SRupavathi

Authorised Signatory

2022లో ఆర్ఆర్ డెవలపర్స్ మున్సిపాలిటీకి రాసిచ్చిన 'గిఫ్ట్ డీడ్'..


Phone No:
Sold To/Issued To:
P Naveen
For Whom/ID Proof:
RudhraConstructionsP

₹ 0000100/-

MEMORANDUM OF UNDERSTANDING – CUM - AGREEMENT

THIS MEMORANDUM OF UNDERSTANDING is made and executed on this the 24th Day of May, 2025 at Hyderabad by and between:

VISHWA SAI TOWNSHIP PLOT OWNERS formed as a residential community built in open land admeasuring Ac 30.08 Gts in Sy Nos 615(P), 616(P), 617, 618, 619(P), 620 (P) & 621 (P), SITUATED AT DUNDIGAL VILLAGE, MEDCHAL-MAKLAJGIRI DIST., TELANGANA 500043

Hereinafter to be called and referred as the "FIRST PARTY" which term unless the context repugnant thereto shall mean and include all his/her/their heirs, successors, representatives, executors, administrators, and assignees etc., of the FIRST PART.

AND

M/s. RUDHRA CONSTRUCTIONS PRIVATE LIMITED, having its Registered Office at RUDHRA HOUSE 3rd AND 4th FLOORS PLOT NOS.8&9, ANAND NAIDU NAGAR, PRAGATHI NAGAR, BACHUPALLY MANDAL, HYDERABAD-500090. Rep.by its Managing Director: SRI.PALLEMPATI NAVEEN S/O.SRI.P.RAMACHANDRA RAO, aged about 44 Years, Occupation: Business, Resident of FLAT NO. 403, PLOT NOS. 98, 99 AND 100, RAMACHANDRA RESIDENCY, SRINIVASA NAGAR COLONY, NIZAMPET, HYDERABAD-90, TELANGANA STATE. (PAN NO. AAHCR6185M) (AADHAR NO. 2431 7526 2786)

Hereinafter to be called and referred as the "SECOND PARTY" which term unless the context repugnant thereto shall mean and include all his/her/their heirs, successors, representatives, executors, administrators, and assignees, Plot Owners/ Residential Owners, Vehicles etc., of the SECOND PART.

WHEREAS, The FIRST PARTY herein are formed as a residential community in open land admeasuring Ac 30.08 Gts, in Sy Nos 615(P), 616(P), 617, 618, 619(P), 620 (P) & 621 (P), SITUATED AT DUNDIGAL VILLAGE, MEDCHAL-MAKLAJGIRI DIST., TELANGANA 500043.

1. x
2. x

For RUDHRA CONSTRUCTIONS PVT. LTD.

Managing Director

రెండు నిర్మాణ సంస్థల నడుమ చేసుకున్న ఎంవోయూ..

- హైడ్రా సీఐ బాలగోపాల్ స్థలాన్ని పరిశీలించి, కేసుల నమోదుకు సూచన..
- ఇంతవరకు 'కేసుల్లేవు- చర్యల్లేవు' ఎక్కడ ఆగిపోయాయి..?
- హెచ్ఎండీఏకు, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసి 45 రోజులు..!
- అక్రమ సీసీరోడ్డును వదిలేసి, చర్యలకు బదులు కందకం తవ్వడం ఏంటి..?
- 'గిఫ్ట్ డీడ్' అంటే ప్రజాప్రయోజనాల కోసం మున్సిపాలిటీకి అప్పగించిన స్థలమా..?
- లేక ప్రైవేటు నిర్మాణ సంస్థల వినియోగానికి వదిలిన స్థలమా..?
- డిప్యూటీ కమిషనర్ మౌనం.. మున్సిపల్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్న వైనం..


సోమవారం మొక్కుబడిగా కందకం తవ్విన మున్సిపల్ సిబ్బంది..



గిఫ్ట్ డీడ్ చేసిన ఆర్ఆర్ డెవలపర్స్ లేఅవుట్..

**అధికారుల కళ్లముందే నిబంధనలకు తూట్లు.. అయినా చలనం లేని యంత్రాంగం విధులు, అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలకు బలం చేకూరుతుంది..! ప్రజల అవసరాల కోసం, చట్టపరంగా రిజిస్ట్రేషన్ ద్వారా, కేటాయించిన స్థలంలో ప్రైవేటు నిర్మాణాలు చేపడుతుంటే..! అధికారుల మౌనం అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది.. అక్రమమని తెలిసి, అడ్డుకోవాల్సిన అధికార వ్యవస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయనే ప్రశ్నలు చర్చనీయాంశంగా తయారయ్యాయి.. అనుమతులిచ్చే ముందు స్థల పరిశీలన జరిగిందా.. నిర్మాణాలు మొదలయ్యాక, పర్యవేక్షణలో భాగంగా కనీసం పట్టించుకున్నారా..? ప్రజల కోసం కేటాయించిన భవిష్యత్తు ప్రజాప్రయోజనాలు ప్రైవేటు నిర్మాణాలకు అనుకూలంగా ఎలా మారుతున్నాయి..? ఇందులో అధికారుల పాత్ర లేకుండా సాధ్యమేనా..?అప్రోచ్ రోడ్డు ఉందో లేదో, వాస్తవ పరిస్థితిని పరిగణలోకి తీసుకోకుండా..!అనుమతుల ప్రక్రియ ఎలా పూర్తయిందన్న ప్రశ్నలు అధికారులను వెంటాడుతున్నాయి.. అయితే ఫిర్యాదులు అందాయి..!తనిఖీలు జరిగాయి..! చర్యలు చేపడతామని చెప్పినట్టు సమాచారం ఉంది.. అయినా క్షేత్రస్థాయిలో దర్జాగా పనులు కొనసాగుతుండటంతో అధికార నియంత్రణా వ్యవస్థలు ఏమయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ శాఖలు నడుమ సమన్వయం లోపించిందా..? నిబంధనలు కాగితాలకే పరిమితమైనట్టు వస్తున్న ఆరోపణలకు ఈ వ్యవహారం ఊతమిస్తోంది..? అన్న ప్రచారం జరుగుతోంది..**

**సీఎంసీ బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

## హైడ్రా సీఐ విజిట్.. కబ్జా గుర్తింపు..?

ఈ నేపథ్యంలో గిఫ్ట్ డీడ్ చేసిన ప్రజా ప్రయోజనాల స్థలంలో నిర్మాణాలపై బీజేపీ నేత ఎంబరి ఆంజనేయులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు స్థలాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. హైడ్రా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్, మున్సిపల్ సిబ్బంది, ఫిర్యాదుదారుడితో కలిసి స్థలాన్ని సందర్శించి గిఫ్ట్ డీడ్, ఎంవోయూ తదితర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు... ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారమే.. మున్సిపాలిటీకి బదలాయించిన స్థలంలో రుద్ర కన్‌స్ట్రక్షన్స్ నిర్మించిన కమాన్, ఇతర పనులపై అధికారి ఆరా తీసినట్లు తెలుస్తోంది. సంబంధిత సంస్థలపై పోలీసు కేసుల నమోదుకు మున్సిపల్ అధికారులకు సూచించినట్లు సమాచారం.. ఈ విషయాన్ని ఫిర్యాదు దారుడు కూడా తెలిపారు..

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్--59 పరిధిలో మున్సిపాలిటీకి రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ ద్వారా ప్రజా ప్రయోజనాల కోసం బదలాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా..! సంబంధిత అధికారుల చర్యలు మాత్రం ముందుకు సాగకపోవడం చర్చనీయాంశంగా తయారైంది.. గత నెలలో హైడ్రా అధికారులు స్థలాన్ని పరిశీలించడం, అక్రమ నిర్మాణంపై పోలీసు కేసుల నమోదుకు సూచనలు చేసినట్లు సమాచారం.. ఈ వ్యవహారంపై 'పెన్ పవర్' దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది.. సిఎంసి, హెచ్ఎండిఏ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా, ప్రయోజనం శూన్యం.. ప్రస్తుతం అదే మున్సిపల్ స్థలంలో రుద్ర కన్‌స్ట్రక్షన్స్ కమాన్‌తో పాటు సీసీరోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతుండటం అధికారుల తీరుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.. దుండిగల్ గ్రామ పరిధిలోని విశ్వసాయి టౌన్‌షిప్ లేఅవుట్‌కు సంబంధించి 29-11-2022న కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నెం.32001/2022గా గిఫ్ట్ డీడ్ రిజిస్టర్ అయినట్లు పత్రాలు సూచిస్తున్నాయి.. సర్వే నెంబర్లు 615(గా), 616, 617, 618, 619(గా), 620(గా), 621(గా)లోని మొత్తం 9,404.47 చదరపు గజాలు (7,862.13 చ.మీ.) ఓపెన్ స్పేస్‌ను ప్రజా ప్రయోజనాలు, ప్రజల సాధారణ వినియోగం కోసం మున్సిపాలిటీకి బదలాయించినట్లు గిఫ్ట్ డీడ్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.. అంటే ఒకసారి రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా మున్సిపాలిటీకి బదలాయించిన అదే స్థలాన్ని.. తర్వాత ప్రైవేటు సంస్థలు తమకు అనుకూలంగా, చేసుకున్న 'పరస్పర అవగాహన ఒప్పందం' (ఎంవోయు) చెల్లుబాటు అవుతుందా అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది..

## గిఫ్ట్ డీడ్ తర్వాత.. 'ఎంవోయు' 45 అడుగుల రోడ్డుకు ఎసరు..!

'గిఫ్ట్ డీడ్' వ్యవహారం ముగిసిన, సుమారు మూడేళ్ల తర్వాత, 24-05-2025న విశ్వసాయి టౌన్‌షిప్ ప్లాట్ యజమానులు--రుద్ర కన్‌స్ట్రక్షన్స్ మధ్య కుదిరినట్లు పేర్కొన్న ఎంవోయూ మరో వివాదానికి తెరలేపింది. ఈ ఒప్పందంలో 45 అడుగుల రహదారి అభివృద్ధి, సీసీరోడ్డు, లైటింగ్, మొక్కల పెంపకం, డ్రైనేజీ, వర్షపు నీటి ప్రవాహానికి మార్గం, సెప్టిక్ ట్యాంక్ కనెక్షన్, ఎగ్జిట్ సదుపాయాలు వంటి అంశాలను, 'ఎంవోయు'లో ప్రస్తావించినట్లు తెలుస్తోంది..

అంతేకాకుండా 45 అడుగుల రహదారిపై 365 రోజులూ 24 గంటల రాకపోకలకు అవకాశం కల్పించేలా పరస్పర అంగీకారం ఉన్నట్లు ఎంవోయూలో పేర్కొన్నారు.. దీంతో అసలు మున్సిపాలిటీకి గిఫ్ట్ చేసిన స్థలంపై ప్రైవేటు ఎంవోయూ ఆధారంగా రహదారి, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి హక్కు ఎక్కడి నుంచి వచ్చిందన్న ప్రశ్నలే ప్రధానంగా తలెత్తుతున్నాయి..

ఏదిఏమైనప్పటికీ మొత్తానికి, ఒకవైపు 2022లో రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ ద్వారా మున్సిపాలిటీకి ప్రజా ప్రయోజనాల కోసం బదలాయించిన 9,404.47 గజాల ఓపెన్ స్పేస్.. మరోవైపు 2025లో ప్రైవేటు సంస్థలు మధ్య కుదిరిన "పరస్పర అవగాహన ఒప్పందం"(ఎంవోయూ) ఈ రెండింటి మధ్య చట్టపరమైన సంబంధం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. ప్రైవేటు ఎంవోయూ ఆధారంగా మున్సిపాలిటీ ఆస్తిపై, వినియోగ హక్కులు ఏర్పడతాయా..? గిఫ్ట్ డీడ్‌లో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలంలో రహదారి, కమాన్, ఇతర నిర్మాణాలకు ఎవరు అనుమతి ఇచ్చారు..? అసలు హెచ్ఎండిఏ అనుమతులు ప్రాతిపదికన మంజూరు చేశారు..? ఈ అధికారిక వ్యవస్థలు, ప్రజల ఆస్తులు కాపాడుతున్నారా..?కట్టబెడుతున్నారా..? అన్నది అర్థం కాని పరిస్థితి.. హైడ్రా తనిఖీ.. చర్యలకు సూచనలు.. అధికారులకు ఫిర్యాదులు.. అయినా నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో ఈ వ్యవహారంపై దుండిగల్ సర్కిల్--59 మున్సిపల్ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు..

## చర్యల ఆదేశాలు అమలయ్యాయా..? కేసుల నమోదు..?

ఇక్కడే తాజా పరిణామం మరింత ఆసక్తికరంగా మారింది. హైడ్రా అధికారి స్థలాన్ని పరిశీలించి చర్యలకు సూచనలు చేసినట్లు సమాచారం ఉన్నప్పటికీ.. ఇప్పటివరకు పోలీసు కేసు నమోదైందా..? లేదా..? అన్నదానిపై స్పష్టత లేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. మరోవైపు నిర్మాణ పనులు మాత్రం ఆగకపోవడం గమనార్హం.. ఇప్పటికే హెచ్ఎండిఏ తప్పుడు అనుమతులు, అక్రమ నిర్మాణాలపై, దుండిగల్ సర్కిల్--59 టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసి సుమారు 45 రోజులు గడిచినట్లు ఫిర్యాదుదారులు చెబుతున్నారు. మధ్యలో హైడ్రా సీఐ స్థలాన్ని సందర్శించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం పెద్దగా మార్పు కనిపించకపోవడం విమర్శలకు కారణమవుతోంది..

## కమాన్ తర్వాత.. సీసీరోడ్డు నిర్మాణం..!

తాజా సమాచారం ప్రకారం.. గిఫ్ట్ డీడ్ ద్వారా మున్సిపాలిటీకి బదలాయించిన స్థలంలో రుద్ర కన్‌స్ట్రక్షన్స్ కమాన్‌తో పాటు సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఫిర్యాదులు, అధికారుల తనిఖీలు, చర్యలకు ఆదేశాలంటూ సమాచారం ఉన్నప్పటికీ పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.. ముఖ్యంగా ప్రజా ప్రయోజనాల కోసం మున్సిపాలిటీకి బదలాయించిన స్థలం కాగా..! దానిపై ప్రైవేటు రుద్ర నిర్మాణ సంస్థ, ఏ ప్రాతిపదికన పనులు చేపట్టడానికి అనుమతి లభించింది..? సంబంధిత మున్సిపల్ విభాగం నుంచి ఎలాంటి అనుమతులు జారీ అయ్యాయి..? 100 విల్లాల నిర్మాణానికి, అప్రోచ్ రోడ్డు లేకుండా, హెచ్ఎండీఏ అనుమతులు ఎలా మంజూరు చేశారన్నదే అనుమానాలకు తావిస్తోంది..

## అక్రమ సీసీరోడ్డును వదిలేసి..! 'కందకం' తవ్వితే చర్యలేనా..?

ఇక మరో అంశం అధికారుల చర్యల తీరుపై అనుమానాలకు తావిస్తోంది.. సీసీరోడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకునేందుకు, వెళ్ళిన మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి బాధ్యతేది..? బాధ్యత కలిగిన అధికారుల బదులు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పంపించి కేవలం కందకం తవ్వి వదిలేయడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణంపై పూర్తి స్థాయి చర్యలు తీసుకోకుండా, మొక్కుబడిగా, సహకరించే ధోరణితో వ్యవహరించారని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. ఈ నిర్లక్ష్యపు చర్యల వెనుక కారణమేంటన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి..


గతనెల రుద్ర ఆక్రమణను సందర్శించిన హైడ్రా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్.. ఫైల్‌ఫొటో..


ఫిర్యాదు దారుడు ఎంబరి ఆంజనేయులు, హైడ్రా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్..ఫైల్‌ఫొటో..






సర్వే నెంబర్ 342లో మట్టిన డంపింగ్ చేస్తున్న టిప్పర్‌లు..

# ప్రభుత్వ భూమిలో.. అర్ధరాత్రి కబ్జాలు..!

అర్ధరాత్రి అక్రమ భూ దందాపై రెవెన్యూ అధికారులు పంజా విసిరారు..! ప్రభుత్వ భూమిలో మట్టినింపి చదును చేస్తున్న భూ కబ్జాదారులపై రెవెన్యూ అధికారులు నిఘా పెట్టి, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.. కుత్బుల్లాపూర్ గాజులరామారంలో కబ్జాల వ్యవహారం మితిమీరి పోతోందని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అధికారుల కళ్లు కప్పి.. ప్రభుత్వ భూములపై కన్నేసిన కబ్జాదారులు బరితెగిస్తున్నారు.. పగటిపూట కాదు.. అర్ధరాత్రి వేళల్లో టిప్పర్లు, జేసీబీలతో మట్టిని తరలించి ప్రభుత్వ భూమిని చదును చేసే దందాకు తెరలేపినట్లు రెవెన్యూ అధికారుల ఫిర్యాదు స్పష్టం చేస్తోంది. గజులరామారం సర్వే నంబర్ 342లో ప్రభుత్వ భూమిలో డంపింగ్ చేస్తూ టిప్పర్, జేసీబీ పట్టుబడటం.. అక్రమ ఆక్రమణల తీరుపై తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు.. రాత్రికి రాత్రే మట్టి పోసి చదును చేసి, ఆ తర్వాత కబ్జాకు రంగం సిద్ధం చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..? ప్రభుత్వ భూముల పరిరక్షణకు, యంత్రాంగం మరింత నిఘా పెంచకపోతే.. విలువైన ప్రభుత్వ భూములు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

- గాజులరామారం ప్రభుత్వ భూమిలో అర్ధరాత్రి మట్టి అక్రమ డంపింగ్ దందా..!
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదుతో సూరారం పోలీసులకు ఫిర్యాదు..
- గజులరామారం సర్వే నం.342లో ప్రభుత్వ భూమి కబ్జా లక్ష్యంగా డంపింగ్ వ్యవహారం..
- అర్ధరాత్రి 1.30 గంటలకు డంపింగ్‌ను గుర్తించిన రెవెన్యూ అధికారులు..
- TS 08 UE 0519 టిప్పర్..! AP 24 AM 1220 జేసీబీ పట్టివేత..
- డ్రైవర్, జేసీబీ ఆపరేటర్ తెలిపిన వివరాలతో ఆర్ఐ పోలీసులకు ఫిర్యాదు..
- ప్రభుత్వ భూమిలోకి డంపింగ్ వాహనాలు, కబ్జాదారుల బరితెగింపుపై ప్రశ్నలు..
- ఈ అక్రమ డంపింగ్ వెనుక అసలు సూత్రధారులు ఎవరు..?
- పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు బయటపడే అవకాశం ఉందన్న రెవెన్యూ..

- తహశీల్దార్ ఆదేశాలు.. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదుతో కేసు నమోదు..
- మట్టినింపిన టిప్పర్,చదును చేసిన జేసీబీని పట్టివేత..
- డ్రైవర్లపైనా చర్యలకు.. సూరారం పోలీసులకు ఫిర్యాదు..

కూల్చివేతలు, క్రిమినల్ కేసుల నమోదు, చేసినప్పటికీ, భూ కబ్జాలు నిత్యకృత్యంగా మారాయి.. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 342 ప్రభుత్వ భూమిలో అర్ధరాత్రి డంపింగ్ జరుగుతున్న వ్యవహారంపై రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.. ప్రభుత్వ భూమిలో అక్రమంగా టిప్పర్‌లతో మట్టిని డంపింగ్ చేస్తున్నారని ఆరోపిస్తూ కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) గులాం ఖలీం మంగళవారం సూరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.. ఫిర్యాదు వివరాల ప్రకారం.. 2026 సెప్టెంబర్ 29న అర్ధరాత్రి సుమారు 1.30 గంటల సమయంలో, ఈమట్టి అక్రమ డంపింగ్ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించారు.. గజులరామారం గ్రామంలోని సర్వే నంబర్ 342లోని ప్రభుత్వ భూమి వద్ద డంపింగ్‌కు, చదునుకు ఉపయోగిస్తున్న TS 08 UE 0519 నంబరు గల టిప్పర్, AP 24 AM 1220 నంబరు గల జేసీబీని గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు..

## వాహనాలు సీజ్.. కేసునమోదు..

ఈ సందర్భంగా టిప్పర్ డ్రైవర్‌గా ఈ. రాజు, తండ్రి ఈ. సతీష్ కాగా, జేసీబీ ఆపరేటర్‌గా బి. శరత్‌బాబు, తండ్రి బి. వెంకటయ్య ఉన్నట్లు ఫిర్యాదులో వివరించారు. టిప్పర్ డ్రైవర్ మొబైల్ నంబరు 9346463461, జేసీబీ ఆపరేటర్ మొబైల్ నంబరు 9704585115గా నమోదు చేశారు.. ప్రభుత్వ భూమిలో, మట్టిని డంపింగ్ చేయడం, సంబంధిత మట్టిని జేసిబితో చదును చేసిన సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీమ్ పోలీసులను కోరారు. ఫిర్యాదు స్వీకరించిన అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు..

## కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు: తహశీల్దార్ రాజేష్..



బైరెడ్డి రాజేష్.. తహశీల్దార్ కుత్బుల్లాపూర్ మండలం..

అర్ధరాత్రి భూ కబ్జాలపై కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో రాజేష్ తీవ్రంగా స్పందించారు.. గాజులరామారంలో ఇటీవలే భారీ కూల్చివేతలు చేపట్టినప్పటికీ..! కబ్జాదారులు బరితెగించి రేయింబవళ్ళు కబ్జాలకు పాల్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. ప్రభుత్వ భూముల కబ్జాల వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు.. గాజులరామారం సర్వే నెంబర్ 307, 329, 342 ప్రభుత్వ భూములపై ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ రాజేష్ తెలిపారు..

ప్రభుత్వ భూమిలో, అర్ధరాత్రి చదును చేస్తున్న జేసిబి వాహనం..







మట్టిని చదును చేసిన జేసిబి సీజ్..




బైరెడ్డి రాజేష్.. కుత్బుల్లాపూర్ తహశీల్దార్..

# పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోండి..

- ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ..
- కుత్బుల్లాపూర్ తహశీల్దార్ బైరెడ్డి రాజేష్ పత్రికా ప్రకటన విడుదల..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియకు ప్రభుత్వం ప్రకటన జారీ..
- 2026 నవంబర్ 1, నాటికి మూడేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసి ఉండాలి..
- ఫారం--18 దరఖాస్తుకు.. డిగ్రీ/డిప్లొమా మార్కుల జాబితా కాపీ జత చేయాలి..
- 2026 నవంబర్ 6, దరఖాస్తుకు చివరి గడువు..
- ceotelangana.nic.in ద్వారా ఆన్‌లైన్‌లోనూ నమోదుకు అవకాశం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి కొత్త ఓటరు జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభమైంది. పట్టభద్రుల ఓటర్లుగా నమోదు కావడానికి అర్హులైన వారు నిర్దేశిత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ బైరెడ్డి రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు.. దరఖాస్తు చేసుకునే వారు, భారతీయ పౌరులై ఉండటంతో పాటు, 2026 నవంబర్ 1 నాటికి కనీసం మూడు సంవత్సరాల క్రితం గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతను పూర్తి చేసిన వారు పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తహశీల్దార్ పేర్కొన్నారు.. ఓటరు నమోదుకు, దరఖాస్తు ఫారం--18ను పూర్తిగా నింపి సమర్పించాలి.. గతంలో పట్టభద్రుల ఓటర్ల జాబితాలో పేరు ఉన్న వారు కూడా, తాజా ఓటరు జాబితా కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ప్రెస్‌నోట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.. దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారి, నోటరీ లేదా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ధృవీకరించిన (అటెస్టెడ్) డిగ్రీ సర్టిఫికెట్, డిప్లొమా లేదా మార్కుల జాబితా కాపీని తప్పనిసరిగా జత చేయాలని సూచించారు..

## నవంబర్ 6 చివరి తేదీ..! ఆన్‌లైన్‌లోనూ అవకాశం..

పట్టభద్రుల ఓటరు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ 2026 నవంబర్ 6వ తేదీ (శుక్రవారం) చివరి తేదీగా నిర్ణయించారు.. అర్హులైన పట్టభద్రులు తమకు సమీపంలోని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో), తహసీల్దార్ లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లోని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్‌వో) లేదా డిజిగ్నేటెడ్ అధికారులకు దరఖాస్తులను స్వయంగా లేదా పోస్టు ద్వారా అందజేయవచ్చని తెలిపారు.. పట్టభద్రుల ఓటరు నమోదుకు ఆన్‌లైన్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. ceotelangana.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు..

## కుత్బుల్లాపూర్ పరిధిలో సంప్రదించాల్సిన అధికారులు..!

కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించవచ్చు.. ఇందుకోసం, కుత్బుల్లాపూర్ మండలం ఎమ్మార్వో కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.. ఫోన్: 7995073757.. అదేవిధంగా కుత్బుల్లాపూర్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు సంబంధించి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చింతల్ సర్కిల్--54, జీడిమెట్ల సర్కిల్-55, కొంపల్లి సర్కిల్--56, గాజులరామారం సర్కిల్--57 డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాలను కూడా సంబంధిత నియమిత అధికారులుగా ప్రకటనలో పేర్కొన్నారు.. ఆయా కార్యాలయాల ద్వారా కూడా దరఖాస్తుల సమర్పణకు అవకాశం ఉంది.. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు జాబితాలో అర్హులైన వారు తమ పేర్లను నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు..

# అధికారంలో లేకున్నా తగ్గని జోరు.. బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు

**హైదరాబాద్, సెప్గెంబర్ 29: పెన్ పవర్:** తెలంగాణలో అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అధికారంలో లేనప్పటికీ పార్టీకి విరాళాలు తగ్గకపోగా, గతేడాది కంటే పెరగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ పార్టీకి రూ. 16.4 కోట్ల విరాళాలు అందినట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన తాజా నివేదికలో ఆ పార్టీ పేర్కొంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) పార్టీకి రూ. 15.1 కోట్ల విరాళాలు అందాయి. ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా పార్టీకి నిధుల ప్రవాహం పెరగడం గమనార్హం. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి భారీగా విరాళాలు అందుతాయనేది రాజకీయాల్లో సహజంగా వినిపించే మాట. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు విరాళాలు పెరగడం ఈ వాదనకు భిన్నంగా ఉంది. ఇది పార్టీ ఆర్థికంగా ఇంకా బలంగానే ఉందని సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్, తిరిగి గద్దెనెక్కాలని బీఆర్ఎస్, తొలిసారి పాగా వేయాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కీలక తరుణంలో బీఆర్ఎస్‌కు నిధులు పెరగడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా మారింది.

**టీడీపీకి అత్యధికంగా ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి విరాళం**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ)లకు అందిన విరాళాలు గత ఆర్థిక సంవత్సరంలో తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా అధికారంలోకి వచ్చినప్పటికీ టీడీపీకి విరాళాలు తగ్గగా, ప్రతిపక్ష హోదాలో ఉన్న వైసీపీకి అందిన విరాళాల్లో భారీ పతనం నమోదైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, రూ. 20 వేలకు మించి స్వీకరించిన విరాళాల వివరాలను ఆయా పార్టీలు భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నివేదించాయి. ఈ నివేదికల ప్రకారం, 2025-26లో వైసీపీకి కేవలం రూ. 24.31 కోట్ల విరాళాలు మాత్రమే అందాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఈ మొత్తం రూ. 140.04 కోట్లుగా ఉండటం గమనార్హం. అంటే, వైసీపీకి అందిన విరాళాలు సుమారు 82 శాతం మేర క్షీణించాయి. మరోవైపు, అధికార టీడీపీకి రూ. 58.25 కోట్ల విరాళాలు రాగా, అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ. 83.03 కోట్లుగా ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీకి అందిన విరాళాలు కూడా దాదాపు 30 శాతం మేర తగ్గుముఖం పట్టాయి

# దుమారం రేపుతున్న రేవంత్ కామెంట్స్..

**హైదరాబాద్, సెప్గెంబర్ 29 పెన్ పవర్:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. లంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రజల మధ్య మత, రాజకీయ పరమైన గుర్తింపులపై ఆయన చేసిన విశ్లేషణ పెద్ద వివాదానికి దారితీసింది. రాజకీయ లబ్ధి కోసం రేవంత్ రెడ్డి సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ తీవ్రంగా విమర్శించింది.



**ఏం జరిగిందంటే..!**

జాతీయ రాజధాని ఢిల్లీలో జరిగిన ఒక మీడియా కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, బీజేపీ నినాదాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ నేతలు పదే పదే 'జై శ్రీరామ్' అని ఎందుకు అంటారని, అదే తరహాలో 'హర హర మహాదేవ్' అని ఎందుకు నినదించరని ఆయన ప్రశ్నించారు. మేం ద్రావిడులం. ఇక్కడి (ఉత్తర భారతదేశం) ప్రజలు ఆర్యులు. మేం శివ భక్తులం, ఇక్కడి ప్రజలు శ్రీరాముడి భక్తులు. బీజేపీ రాముడిని దొంగిలించింది. అది ఒక భావోద్వేగం. మోదీ గారు 'హర హర మహాదేవ్' అని ఎందుకు అనరు? బీజేపీ నేతలు వేదికపై ఆ నినాదం చేయడం మీరు ఎప్పుడైనా చూశారా? వాళ్లు కేవలం 'జై శ్రీరామ్' అంటారు. మేం 'హర హర మహాదేవ్' అంటే వారికి నచ్చదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. శివుడిని 'పేదల దేవుడు' అని, రాముడిని 'ధనవంతుల దేవుడు' అని అభివర్ణించిన ఆయన, ఇద్దరు దేవుళ్లను ప్రజలు ఆరాధిస్తారని కూడా స్పష్టం చేశారు. ఉత్తర, దక్షిణ భారతదేశ రాజకీయ సంస్కృతులు, సామాజిక గుర్తింపుల మధ్య విస్తృతమైన తేడాలు ఉన్నాయనే వాదనకు బలం చేకూర్చే క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే హిందువులను విభజించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు."రాహుల్ గాంధీ సూచనల మేరకు, హిందువులను విభజించడానికి కొత్త మార్గం కనుగొనే ప్రయత్నంలో భాగంగానే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు" అని ప్రదీప్ భండారీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీని 'ఆధునిక ముస్లిం లీగ్ కాంగ్రెస్' అని అభివర్ణించిన ఆయన, రాముడు, శివుడి అనుచరుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు ఫలించవని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అనేక మతపరమైన, ఆలయ సంబంధిత కార్యక్రమాలను వ్యతిరేకించిందని ఆయన గుర్తుచేశారు. "సోమనాథ్ ఆలయ నిర్మాణాన్ని, కాశీ విశ్వనాథ్ ధామ్ కారిడార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకించిన విషయం దేశం మరిచిపోలేదు. 2018లో 'హర హర మహాదేవ్' అని నినదించినందుకు ముగ్గురు పార్టీ కార్యకర్తలను సస్పెండ్ చేసింది" అని భండారీ ఆరోపించారు.

.రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయాల కోసం దేవుళ్లను, ప్రాంతాలను వర్గాలుగా విడదీయడం సరికాదని హితవు పలికారు. తెలంగాణలోనే రాముడు, శివుడు ఇద్దరికీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయని ఈ సందర్భంగా బండి సంజయ్ గుర్తుచేశారు. వేములవాడను దక్షిణ కాశీగా, అదే విధంగా భద్రాచలాన్ని దక్షిణ అయోధ్యగా భక్తులు ఆరాధించడం నిజం కాదా అని ప్రశ్నించారు. రాముడు, శివుడి ఏకత్వానికి ప్రతీకగా నిలిచే హరిహర క్షేత్రం మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్యంకొండలో ఉందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి చేసిన నార్త్-సౌత్, రాముడు-శివుడు అనే రాజకీయ విభజన అబద్ధమని నిరూపించేందుకు తెలంగాణలోని ఈ ఆధ్యాత్మిక క్షేత్రాలే సరైన సమాధానమని బండి సంజయ్ స్పష్టం చేశారు. అలాంటి ప్రాంతానికి ముఖ్యమంత్రిగా ఉండి రాముడు, శివుడిని ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలకు పరిమితం చేస్తూ ప్రజలను, ప్రాంతాలను ఎలా విడదీస్తారని బండి సంజయ్ ప్రశ్నించారు. సనాతన ధర్మంలో హరి, హరులకు భేదం లేదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి మతపరమైన అంశాలను, గుర్తింపులను తెరపైకి తెస్తున్నారని బీజేపీ నేతలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అయితే, రేవంత్ రెడ్డి వ్యాఖ్యల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఉత్తరాది, దక్షిణ రాష్ట్రాల మధ్య ఉన్న రాజకీయ వ్యూహాలు, బీజేపీ ఎన్నికల సరళి, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పై దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న ఆందోళనలను ఎత్తిచూపడమేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు వివాదం కేవలం ఆధ్యాత్మిక చర్చకే పరిమితం కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మాటల యుద్ధానికి దారితీసింది. ఢిల్లీలో జరిగిన ఓ మీడియా కార్యక్రమంలో రేవంత్ రెడ్డి. ఉత్తరాది, దక్షిణాది రాజకీయాలను ప్రస్తావిస్తూ.. తాము ద్రావిడులమని, ఉత్తరాది వారు ఆర్యులన్నారు. దక్షిణాది వారు శివ భక్తులమని, ఉత్తరాదిన రాముడ్ని పూజిస్తారని పేర్కొన్నారు. రాముడు ధనికుల దేవుడు కాగా, శివుడు పేదల దేవుడని.. బీజేపీ మాత్రం జైశ్రీరామ్ అంటూ రాముడి పేరుతో రాజకీయాలు చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. 'జై శ్రీరామ్' అనే బీజేపీ నేతలు 'హర హర మహాదేవ్' అని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. అయితే రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు తెలంగాణ సీఎం తీరును తప్పుపడుతున్నారు.

## అధికార పార్టీలకు మైలేజీ ఇస్తుందా

**హైదరాబాద్, సెప్టెంబర్ 29, పెన్ పవర్:** ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ ఉపఎన్నికల కౌంట్‌డౌన్ ప్రారంభం కాగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల వ్యవధిలోనే ఇక్కడఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్‌తో పాటు విస్తృతమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా స్థానిక సమరానికి ఎందుకు ముహూర్తం ఖరారు కావడం లేదనేది ఇప్పుడుహైదరాబాద్ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది. జీహెచ్ఎంసీ పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ, ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల వైపు వేగంగా అడుగులు వేయకపోవడంవెనుక పలు రాజకీయ, పరిపాలనాత్మక కారణాలు ఉన్నాయి.గ్రేటర్ పాలనను మరింత వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిగావిభజించారు. ఈ విభజన తదుపరి పునర్విభజన , వార్డుల సంఖ్య పెంపు, బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో నడుస్తున్న వివాదాలు ప్రభుత్వం ముందుకు రాకుండా అడ్డంకిగా మారాయి. ఖైరతాబాద్ ఉపఎన్నికఎలాగూ తప్పదు కాబట్టి, అదే ఊపులో గ్రేటర్ ఎన్నికలను కూడా నిర్వహించి ముగించేస్తే ఒక పని అయిపోతుందనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అత్యంత జాగ్రత్తగా అడుగులువేస్తోంది. నిజానికి గ్రేటర్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. ఈ వరుస విజయాలు అధికార పార్టీకి మంచి మైలేజ్ ఇచ్చాయనడంలోసందేహం లేదు. అయినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ స్థానిక పోరు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎందుకు సందేహిస్తోంది? మొదటిది, అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఉపఎన్నికల సరళి వేరు, మున్సిపల్‌వార్డు స్థాయి ఎన్నికల సరళి వేరు. కార్పొరేటర్ల స్థాయి పోరులో స్థానిక సమస్యలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, మూసీ పునరుజ్జీవన పథకం వల్ల ప్రభావితమైన నిర్వాసితుల అసంతృప్తి నేరుగా ఓటింగ్‌పైప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కొన్ని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు గ్రేటర్ పరిధిలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాల్లో కొంత కలకలం రేపాయి. ఈ పరిస్థితుల్లోముందస్తుగా గ్రేటర్ ఎన్నికలకు వెళ్తే అది ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు కలిసివస్తుందేమోననే భయం కాంగ్రెస్ స్థానిక నేతల్లో ఉందనే ప్రచారం ఉంది.రెండవది, కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగర పరిధిలోఉన్న బలమైన కేడర్ కొరత. గతంలో ఎంఐఎం, బీఆర్ఎస్‌లకు గ్రేటర్‌లో పక్కా యంత్రాంగం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కొంతమంది విలీనమైనప్పటికీ, వార్డు స్థాయిలో300 వార్డుల పరిధిలో సరైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడం కాంగ్రెస్‌కు ఐక్యతాపరంగా పెద్ద సవాలుగా మారనుంది. పార్టీ అంతర్గత విభేదాలు బయటపడితే గ్రేటర్ గెలుపుపై ప్రభావం పడుతుందనేయోచనలో నాయకత్వం ఉంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం కాంగ్రెస్‌కు లిట్మస్ టెస్ట్‌గా మారబోతోంది. ఒకవేళ ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ , కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధిస్తే, ఆపొలిటికల్ వేవ్‌ను వాడుకుని తక్షణమే గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అప్పటివరకు న్యాయస్థానాల్లో ఉన్న లీగల్ అడ్డంకులను క్లియర్ చేసి, వార్డులరిజర్వేషన్లను ఖరారు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.రాబోయే 3 నుంచి 4 నెలల్లో ఖైరతాబాద్ ఉపఎన్నికతో పాటు గ్రేటర్ సమరంపై రేవంత్ రెడ్డి సర్కార్ ఒక స్పష్టమైన నిర్ణయానికి రాక తప్పదు.

## పొంగులేటి పై చర్యలకు సిద్ధమేనా

**హైదరాబాద్, సెప్టెంబర్ 29, పెన్ పవర్:** :హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతలు చేపట్టిన ఆందోళన చర్చనీయాంశమైంది. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన ఈడీ విచారణపై ఆరాతీస్తామంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున ఈడీ ఆఫీసు ముట్టడికి ప్రయత్నించారు. రెండేళ్ల క్రితం జరిగిన సోదాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలు తమకు చెప్పాలంటూ వారుడిమాండ్ చేస్తున్నారు.సోమవారం ఉదయం ఈడీ కార్యాలయం బయట బీఆర్ఎస్ నేతలు బైఠాయించి నినాదాలు చేస్తుండటంతో పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళనలోఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్, ఎమ్మెల్సీలు శంబిపూర్ రాజు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొని పోలీసుల తీరుపై వాగ్వాదానికి దిగారు. అయితే, ఆ తర్వాత పోలీసుల అనుమతితో ఒక ప్రతినిధిబృందం ఈడీ అధికారులను కలిసే అవకాశం కల్పించారు. అయినా హడావుడి కోసం రోడ్డుపై బైఠాయించి ధర్నాచేసారు. కాంగ్రెస్ మంత్రులకు ఒక రకమైన న్యాయం, ప్రతిపక్ష నేతలకు మరో రకమైన న్యాయంజరుగుతోందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ లో విమర్శలు చేశారు.చట్టబద్ధంగా నడిచే కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరులో జోక్యం చేసుకునే హక్కు ఏ రాజకీయ పార్టీకి ఉండదు. దర్యాప్తు ఏదశలో ఉందనే అంశాలను బహిర్గతం చేయాల్సిన బాధ్యత ఈడీకి ఉండదు. కానీ, కేవలం రాజకీయంగా ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలనే ఉద్దేశంతో, తాము చెప్పినట్టుగానే దర్యాప్తు సంస్థలు పనిచేయాలనిబీఆర్ఎస్ నేతలు ఒత్తిడి తెస్తుండటం విచిత్రంగా ఉందన్న వాదన వినిపిస్తోంది. ఒకవైపు సొంత పార్టీ నేతలు ఎదుర్కొంటున్న కేసుల విచారణ సమయంలో దర్యాప్తు సంస్థలను తప్పుపట్టిన గులాబీ నేతలు,ఇప్పుడు ఇతర పార్టీల నేతల విషయంలో తామే జ్యుడీషియరీగా మారిపోయి తీర్పులు చెప్పాలని చూస్తున్నారని అంటున్నారు.

## సరికొత్త రికార్డు క్రియేట్ చేస్తున్న రియల్ ఎస్టేట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 29, పెన్ పవర్:** ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మక ఏడవ అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్ కు హైదరాబాద్ నగరం ఆతిథ్యమిచ్చి సరికొత్త రికార్డు సృష్టించింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈఅంతర్జాతీయ సదస్సు భారతదేశంలో జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. 2026 సెప్టెంబర్ 25 నుండి 27 వరకు మూడు రోజుల పాటు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని అత్యంతఘనంగా నిర్వహించారు. ఈ గ్లోబల్ ఈవెంట్‌కు అమెరికా, యూకే, యూఏఈ, సింగపూర్ సహా ప్రపంచవ్యాప్తంగా 35కు పైగా దేశాల నుంచి 1500 మందికి పైగా అంతర్జాతీయ ప్రతినిధులు, పరిశ్రమలఅధినేతలు, డెవలపర్లు , గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ నిపుణులు హాజరయ్యారు.ది డోర్ టు వాట్ హ్యాపెన్స్ నెక్స్ట్ అనే ప్రధాన థీమ్‌తో నిర్వహించిన ఈ సదస్సులో రియల్ ఎస్టేట్ రంగంలో రాబోయే ఊహించనిమార్పులు, ప్రపంచ ఆర్థిక ప్రాధాన్యతలు , అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహంపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఆధునిక సాంకేతికతలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , ప్రాప్‌టెక్ , డీప్‌టెక్, సుస్థిరపర్యావరణ అభివృద్ధి వంటి కీలక అంశాలపై అంతర్జాతీయ నిపుణులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సదస్సు కేవలం చర్చలకే పరిమితం కాకుండా.. అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్,ప్రాప్‌టెక్ అండ్ ఇన్నోవేషన్ షోకేస్, లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పో అనే మూడు ప్రధాన విభాగాలు ఒకే వేదికపై కొలువుదీరి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ చారిత్రాత్మక వేదికపై నేషనల్ అసోసియేషన్ఆఫ్ రియల్టర్స్-ఇండియా ఛైర్మన్ సుమంత్ రెడ్డి ప్రస్తుతం భారతదేశానికి చెందిన డెవలపర్లు, రియల్టీ నిపుణులు ,మౌలిక వసతుల ప్రాజెక్టులు అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోని రీతిలోరూపుదిద్దుకుంటున్నాయని అని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఐఆర్ఈసీ సదస్సు భారతీయ రియల్ ఎస్టేట్ సత్వర పురోగతిని, మన దేశ నిర్మాణ రంగ సామర్థ్యాన్ని ప్రపంచ వేదికపై సగర్వంగాచాటిచెప్పేందుకు ఒక ఉత్తమ వేదికగా నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు.అలాగే 2026 ఛైర్ శైలేందర్ సింగ్ ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన సరికొత్త ఆవిష్కరణలు,అంతర్జాతీయ పెట్టుబడులతో భారతదేశాన్ని అనుసంధానించే అత్యుత్తమ గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం అని స్పష్టం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు విజయవంతంగాముగియడంతో అంతర్జాతీయ మ్యాప్‌లో హైదరాబాద్ కీర్తి ప్రతిష్టలు మరోస్థాయికి చేరడమే కాకుండా, రాబోయే రోజుల్లో భారతీయ రియల్ ఎస్టేట్ రంగంలోకి, ముఖ్యంగా తెలంగాణ ఇన్‌ఫ్రా విభాగానికి వందలాదికోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పారేందుకు మార్గం సుగమమైందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కవిత ఓటు ఎవరికి చేటు

**హైదరాబాద్, సెప్టెంబర్ 29, పెన్ పవర్:** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తెలంగాణలో జరిగే అన్ని ఎన్నికలలో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. కవిత పోటీ చేయడం వల్ల ఏ పార్టీకి లాభం? ఎవరికి నష్టం? అసలు కవిత పార్టీఅనుకున్న స్థాయిలో ఓట్లను సాధిస్తుందా? అన్న దానిపైన ప్రస్తుతం చర్చ జరుగుతుంది. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ, తర్వాత జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లోనూతెలంగాణ రక్షణ సేన అభ్యర్థులు బరిలో ఉంటారని కవిత ప్రకటించారు. దీంతో ఎవరి ఓట్లకు గండి కొట్టనున్నారన్న హాట్ టాపిక్ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో నడుస్తుంది. కల్వకుంట్ల కవిత తన సరికొత్తరాజకీయ ప్రయాణంలో 'సామాజిక తెలంగాణ' సాధించడమే తన ప్రధాన లక్ష్యం అని ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత, ఆమె తెలంగాణ రక్షణ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీనిస్థాపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆశించిన ఆశయాలు నెరవేరలేదని, భౌగోళిక తెలంగాణ సిద్ధించినప్పటికీ సామాజిక తెలంగాణ ఇంకా సాకారం కాలేదని ఆమె పేర్కొన్నారు.ఆమె తన కొత్త పార్టీద్వారా ఎన్నికల్లో పోటీ చేసి ఏమి చేయాలనుకుంటున్నారనే దానికి సంబంధించిన ముఖ్యమైన ఐదు గ్యారెంటీలు కూడా ప్రకటించారు. ప్రైవేట్ స్కూళ్లలో సైతం నాణ్యమైన, ఉచిత విద్యను అందించడం.దీర్ఘకాలిక వ్యాధులతో సహా అన్ని రకాల రోగాలకు పూర్తి ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించడం. యువతలో స్వయం ఉపాధి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి స్టార్టప్‌లకు తగిన నిధులుఅందించడం. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతులకు ప్రత్యేక సహాయక డెస్క్‌లను ఏర్పాటు చేసి, 'రైతే రాజు' అనే నినాదాన్ని నిజం చేయడం.వెనుకబడిన తరగతులకు, మహిళలకు, యువతకురాజకీయంగా, సామాజికంగా సమాన అవకాశాలు కల్పించడం వంటి నినాదాలతో ఎన్నికలకు కవిత పార్టీ వెళ్లనుంది.. ఆమె నాయకత్వంలోని పార్టీ రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థలు,ఉప ఎన్నికలతో పాటు 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ పూర్తిస్థాయిలో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 4 లక్షల ఉద్యోగాలను సృష్టించడం తమ లక్ష్యమనిప్రకటించారు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు మరియు ఖైరతాబాద్ ఉప ఎన్నికల వంటి స్థానిక పోరులో అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా ప్రజాక్షేత్రంలో తమ పట్టును బలోపేతం చేసుకోవాలని భావిస్తున్నారు.రాష్ట్రహక్కుల పోరాటం: కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో రాష్ట్రాలకు సమాన అధికారాలు ఉండాలని, ప్రజాస్వామ్య ఫ్రంట్‌గా ఏర్పడి ప్రజల నిజమైన ఆకాంక్షల కోసం పోరాడాలని కవిత లక్ష్యంగా పెట్టుకున్నారు.

# 'నాతో పెట్టుకోకు'.. అన్న కేటీఆర్ కు డైరెక్టుగా వార్నింగ్ ఇచ్చేసిన కవిత





**హైదరాబాద్, సెప్టెంబర్ 29, పెన్ పవర్:**తెలంగాణ రాజకీయం అంటేనే ఓ డ్రామా.. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్. అయితే ఈసారి థియేటర్లలో కాదు.. సొంత ఇంటి కాంపౌండ్ వాల్‌లోనే అసలు సీన్ ప్లే అవుతోంది. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అన్నా-చెల్లెళ్ల సవాళ్లు పార్ట్-2 సూపర్ హిట్‌గా నడుస్తోంది. బీఆర్ఎస్ నుంచి బహిష్కరించిన తర్వాత కేటీఆర్ తో కవితకు దూరం బాగా పెరిగింది. ఇప్పుడు డైలాగులు మారిపోయాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి, ఆయన చెల్లెలు కవిత నేరుగా "నాతో పెట్టుకోకు బాసూ... సీన్ రివర్స్ అయిపోద్ది" అని హెచ్చరించడంతో పొలిటికల్ హీట్ ఒక్కసారిగా పెరిగిపోయింది.

విషయం ఏంటంటే... పార్టీ ఎందుకు ఓడిపోయింది? నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలే సుప్రీం అని కేసీఆర్ ఇచ్చిన ఓవరాక్షన్ ఆప్షనే ముంచేసిందా? అంటూ కేటీఆర్ గారు రివ్యూలు, అనాలిసిస్‌లు మొదలుపెట్టారు. పోనీలే ఏదో వారి పార్టీలో ఆత్మపరిశీలన చేసుకుంటున్నారని అంతా అనుకునేలోపే... చెల్లెమ్మ కవిత రంగంలోకి దిగారు. "ఏంటి అన్నయ్యా... నీ చేతగానితనాన్ని తీసుకెళ్లి పెద్దాయన కేసీఆర్ ఖాతాలో వేస్తున్నావా?" అంటూ గట్టిగానే క్లాస్ పీకారు. అంతేకాదు కేటీఆర్ ఎవరో "గుంటనక్క మైండ్ గేమ్"లో పడిపోయారని.. మైండ్ బ్లాక్ అయ్యేలా ఒక రేంజ్‌లో సెటైర్లు పేల్చారు.

ఇంతటితో ఆగిపోతే అది పొలిటికల్ సీరియల్ ఎందుకు అవుతుంది? గణేష్ నిమజ్జనం రోజున డబ్బులిచ్చి మరీ కేసీఆర్ పాటలు పెట్టించారంటూ కవిత గారు ఒక బాంబు పేల్చారు. "నా దగ్గర అన్నిటికీ కచ్చితమైన ప్రూఫ్‌లు ఉన్నాయిరా భాయ్... నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా" అని వార్నింగ్ ఇవ్వడంతో అసలు కథ ఇప్పుడే మొదలైంది.

ఎమ్మెల్యేల జోక్యం, నాయకత్వ లోపాలు, వర్గపోరు అంటూ కేటీఆర్ ఎంత కవర్ చేద్దామని చూసినా కవిత మాత్రం "అంతేలే... విజయం వస్తే మీది.. ఓటమి వస్తే మాత్రం డ్యాడీదా?" అని పాయింట్ టు పాయింట్ లాజిక్‌లతో కౌంటర్లు ఇచ్చేశారు. మొత్తానికి విపక్షాలకు మైక్ దొరకకముందే సొంత ఇంట్లోనే "నాతో పెట్టుకోకు" అంటూ డైరెక్ట్ వార్నింగ్స్ నడుస్తుంటే గులాబీ కేడర్ మాత్రం "అన్నా చెల్లెలు ఫైటింగ్ చూసి మేమేం అయిపోవాలి సామీ" అని తలలు పట్టుకుంటోంది. మరి ఈ ఆధారాల కథ ఏ మలుపు తిరుగుతుందో.. రాబోయే రోజుల్లో ఈ అన్నాచెల్లెళ్ల సవాల్ ఇంకెన్ని ట్విస్టులు ఇస్తుందో చూడాలి..

# సిరిసిల్లలో రేవంత్ అసలు టార్గెట్ ఇదేనా?

## కేటీఆర్ కోటనే ఎందుకు ఎంచుకున్నారు?



**హైదరాబాద్, సెప్టెంబర్ 29, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయం ప్రస్తుతం బీఆర్ఎస్ కీలక నాయకుల సొంత నియోజకవర్గాల చుట్టూ తిరుగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుసగా నాలుగుసార్లు ప్రాతినిధ్యం వహించిన సిరిసిల్ల స్థానంలోసెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. సుమారు రూ. 1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు రగుడు బైపాస్ వద్ద భారీ బహిరంగ సభను కాంగ్రెస్ ప్లాన్ చేసింది. పదేళ్ల పాలనలో కేటీఆర్ సిరిసిల్లను ఆదర్శంగా తీర్చిదిద్దామని చెప్పుకుంటుంటే, నాలుగుసార్లు గెలిపించిన ప్రజలకు సరైన అభివృద్ధి చేయలేదు అని రేవంత్‌ప్రభుత్వం కౌంటర్ ఇస్తోంది. కేటీఆర్ గడపలోనే ఆయన వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా రాజకీయంగా మానసిక ఆధిపత్యం సాధించాలనేది కాంగ్రెస్ ప్రధాన వ్యూహం.సెప్టెంబర్ 30న సిరిసిల్లలో సీఎంరేవంత్‌రెడ్డి నిర్వహించబోయే సభ సాధారణ ప్రభుత్వ కార్యక్రమంగానో లేదా పార్టీ సభగానో కాకుండా అంతకు మించి ఉండబోతోందన్న సంకేతం కనిపిస్తోంది. ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఇదే చర్చకూడా. ఎందుకంటే రేవంత్ ఎంచుకున్నది సాధారణ నియోజకవర్గం కాదు. అది కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల.అక్కడే భారీ బహిరంగ సభ.. దానికి ముందు నాలుగు కిలోమీటర్ల రోడ్‌షో.. రాష్ట్రంలోని కీలక మంత్రులు, కాంగ్రెస్ నేతల మోహరింపు.. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల నుంచి జన సమీకరణ.. ఇవన్నీ చూస్తే రేవంత్ పర్యటనను కేవలం అభివృద్ధి కార్యక్రమాల పర్యటన కాదు.. మరోవైపు బీఆర్ఎస్ కంచుకోటలో కాంగ్రెస్ రాజకీయ శక్తిని ప్రదర్శించడ కూడా ఈ సభలోని రెండు ప్రధాన లక్ష్యాలు.కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం, వచ్చే ఏడాది నుంచి నీటి నిల్వరేవంత్‌కు సిరిసిల్లలో ఒక ప్రత్యేక రాజకీయ లెక్క ఉంది. కేటీఆర్‌కు ఇది కేవలం ఎమ్మెల్యే నియోజకవర్గం కాదు. 2009, 2014, 2018, 2023 ఎన్నికల వరకు సిరిసిల్లలో కేటీఆర్ వరుస విజయాలు సాధించారు. అంటే సిరిసిల్లలో కేటీఆర్ అజేయుడు కాదనే పొలిటికల్ నరేటివ్ సృష్టించడం రేవంత్ ముఖ్య వ్యూహం కావచ్చు. రాజకీయాల్లో ప్రత్యర్థి బలహీనంగా ఉన్న చోట బలం చూపించడం పెద్ద విషయం కాదు. ప్రత్యర్థి బలమైన చోటికి వెళ్లి బలం చూపించడమే పెద్ద మెసేజ్ ఇస్తుంది. రేవంత్ సిరిసిల్ల ద్వారా అదే సందేశాన్ని ఇవ్వాలని చూస్తున్నారా? అనేది ఇప్పుడు ఆసక్తికరమైనప్రశ్న.సిరిసిల్ల సభను కేవలం రేవంత్ వర్సెస్ కేటీఆర్‌గా చూడటం ఈ వ్యూహాన్ని చిన్నదిగా చూసినట్టే. రేవంత్ లక్ష్యం బీఆర్ఎస్ రాజకీయ మానసిక ఆధిక్యాన్ని సవాలు చేయడం కావచ్చు. కేటీఆర్‌సిరిసిల్లలో గెలవడం ఒక ఎన్నికల ఫలితం.కానీ "కేటీఆర్ అంటే సిరిసిల్ల.. సిరిసిల్ల అంటే కేటీఆర్" అనే రాజకీయ ఇమేజ్‌ను మార్చడం మాత్రం చాలా పెద్ద రాజకీయ విజయం అవుతుంది. అందుకే సభకువచ్చే జనసందోహం, రోడ్‌షోలో కనిపించే స్పందన, స్థానిక నేతల పాల్గొనడం, కేటీఆర్‌పై రేవంత్ చేసే రాజకీయ దాడి కంటే కూడా సిరిసిల్ల ప్రజల్లో కాంగ్రెస్‌కు పొలిటికల్ స్పేస్ ఎంత? అన్నదే కాంగ్రెస్‌కుముఖ్యమైన కొలమానం.ఇక్కడ మరో కీలక అంశం ఉంది. సిరిసిల్ల సభను కాంగ్రెస్ ఒక నియోజకవర్గ కార్యక్రమంగా కాకుండా రాష్ట్రస్థాయి పవర్ షోగా మలచడానికి ప్రయత్నిస్తోంది. మంత్రులు తుమ్మలనాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నాలుగుకిలోమీటర్ల రోడ్‌షోతో పాటు భారీ జన సమీకరణకు కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది.అంటే "కేటీఆర్‌ను ఓడించగలమా?"లిలి అన్నదానికంటే ముందుగా.."కేటీఆర్ కోటలో కాంగ్రెస్ ఎంత పెద్ద రాజకీయ శక్తిగాకనిపించగలదు? అన్న ప్రశ్నకు సమాధానం చూపించాల్సిన వేదికగా సిరిసిల్లను మలుస్తున్నట్టు కనిపిస్తోంది.ఈ వ్యూహం ఒక్కరోజులో పుట్టింది కాదు. సెప్టెంబర్ 5న నకిరేకల్ సభలోనే రేవంత్‌రెడ్డి సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్‌లను ప్రస్తావించారు. సిరిసిల్లలో కేటీఆర్‌ను, సిద్ధిపేటలో హరీశ్‌రావును, గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. సిరిసిల్లకు సెప్టెంబర్‌లో,సిద్ధిపేటకు అక్టోబర్‌లో వెళ్తానని చెప్పారు. అంటే సిరిసిల్ల ఒక టెస్ట్ కేసు.ఇక్కడ కాంగ్రెస్ నిర్వహించే సభకు వచ్చే స్పందన ఎలా ఉంటుంది? స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ఎంతవరకు సమన్వయంతో పనిచేస్తుంది? కేటీఆర్‌కు వ్యతిరేకంగా ఉన్న స్థానిక అసంతృప్తిని కాంగ్రెస్ ఎంతవరకు రాజకీయంగా ఉపయోగించుకోగలదు? ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎంతవరకు కనెక్ట్ చేయగలదు? ఈ ప్రశ్నలకు సిరిసిల్లలో రేవంత్‌కు వచ్చే సమాధానం తర్వాతి అడుగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.రేవంత్ సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ సభల ద్వారా మూడు రాజకీయ సందేశాలను పంపాలనుకుంటున్నారు. 1. బీఆర్ఎస్ కోటల్లోకీ కాంగ్రెస్ వస్తుంది, ఇది కేటీఆర్‌కు మాత్రమే కాదు.. బీఆర్ఎస్ కేడర్‌కు కూడాఇచ్చే సందేశంగా చూడొచ్చు. 2. కాంగ్రెస్ కేవలం అధికారంలో ఉన్న పార్టీ కాదు.. ఎన్నికల మోడ్‌లో ఉన్న పార్టీ అని చెప్పడం అది పార్టీ కేడర్‌కు కూడా ఒక మెసేజ్ ఇస్తుంది. 3. బీఆర్ఎస్ పునరాగమనానికి అవకాశం లేదన్న నరేటివ్ సృష్టించడం. ఇక్కడే సిరిసిల్ల సభ మరింత ఆసక్తికరంగా మారింది. పైగా ఇప్పుడు ఏం చేస్తారన్నది ఆసక్తిగా మారింది. రేవంత్ "నేను నీ కోటలోకి వస్తున్నా" అనే రాజకీయసందేశం ఇవ్వబోతుంటే.. కేటీఆర్ మాత్రం "వస్తున్నారు కదా.. మా ప్రశ్నలకు సమాధానం చెప్పండి" అంటూ చర్చను మరో ట్రాక్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. సెప్టెంబర్ 27న కేటీఆర్ రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలపై ఆధారాలు ముందు పెట్టాలని కోరారు. అక్కడితో ఆగలేదు. సిరిసిల్ల నేతన్నలకు కోట్ల రూపాయల బకాయిలు, యార్న్ సబ్సిడీ, నేతన్న బీమా, వీవింగ్ పార్క్, రైతు భరోసా, రుణమాఫీ తదితర అంశాలపై కూడా సీఎం సమాధానం చెప్పాలని కోరారు. అంటే ఇప్పుడు రేవంత్ ముందున్న రాజకీయ సవాలు కొంత మారింది.ఇక్కడేసెప్టెంబర్ 30 ప్రసంగం కీలకంగా మారనుంది. రేవంత్ కేవలం "కేటీఆర్ ఓడిపోతారు" అని మాట్లాడితే అది సాధారణ రాజకీయ విమర్శగా మిగిలిపోవచ్చు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ ప్రభుత్వంలో నిధులన్నీ గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలకే వెళ్లాయి.. అభివృద్ధి అంటే ఈ మూడు నియోజకవర్గాలేనా అన్న ప్రశ్న ఎదురైంది. అలాంటి పరిస్థితుల్లో రేవంత్ అక్కడికెళ్లి స్థానికులకు కొత్తగా ఏంహామీలివ్వగలరు. కానీ సిరిసిల్లకు సంబంధించిన స్పష్టమైన లెక్కలు చెబితే? ఎన్ని పనులు చేశాం? ఎన్ని నిధులు ఇచ్చాం?ఏ ప్రాజెక్టుకు ఎంత ఖర్చు చేశాం? నేతన్నలకు ప్రభుత్వం ఏం చేసింది? రాబోయే రోజుల్లో ఏం చేయబోతున్నాం? ఇలా సిరిసిల్లకే ప్రత్యేకమైన లెక్కలతో మాట్లాడితే సభకు వేరే రాజకీయ బలం వస్తుంది. అందుకే రేవంత్ ప్రసంగంలోని రాజకీయ పంచ్‌లపై మాత్రమే కాదు.. ఆయనచెప్పబోయే సిరిసిల్ల స్పెసిఫిక్ డేటాపైనా ఇప్పుడు అందరి దృష్టి ఉంది.ఇది బహుశా మొత్తం వ్యూహంలో అత్యంత ముఖ్యమైన అంశం. ఈ మూడు నియోజకవర్గాలు ఒకే రాజకీయ కుటుంబం, ఒకే పార్టీ అగ్రనాయకత్వంతో బలంగా అనుసంధానమై ఉన్నాయి. అందుకే రేవంత్ ఈ మూడు ప్రాంతాల్లో వరుసగా రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తే అది కేవలం నియోజకవర్గాల పర్యటన కాదు. బీఆర్ఎస్ రాజకీయ కేంద్రాల చుట్టూ కాంగ్రెస్ తన రాజకీయ కథనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటి వరకు తెలంగాణ రాజకీయ చర్చలో ప్రధాన ప్రశ్న "కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది?" అని రేవంత్‌సిరిసిల్ల-సిద్ధిపేట వ్యూహం ఆ చర్చను మరో ప్రశ్నవైపు తిప్పాలనుకుంటున్నారు. "2028లో బీఆర్ఎస్ తిరిగి వస్తుందా?" లేదా "కాంగ్రెస్ బీఆర్ఎస్ బలమైన కోటలను కూడా బద్దలు కొట్టగలదా?" ఇదికాంగ్రెస్‌కు అనుకూలమైన చర్చగా మారుతుందా, బీఆర్ఎస్‌కు రాజకీయంగా ఉపయోగపడుతుందా అన్నది భవిష్యత్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. రెండు పార్టీలమధ్య 2028 పోటీకి దేఖ్ లేంగే నినాదం మాత్రం మొదలైంది. ఈ ప్రశ్నకు సమాధానం ఈ వరుస సమావేశాలు చెప్తాయి.. వేలకోట్ల నిధులతో అభివృద్ధి చేసిన నియోజకవర్గాల్లో రేవంత్ స్థానికంగా ఎంత బల ప్రదర్శన చేయగలరు. వాటి ప్రభావంతో ఆయా నియోజకవర్గాల్లో బీఆరెస్ స్థైర్యాన్ని దెబ్బతీయగలరా. భారీ జనసమీకరణ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలకు నూతన ఉత్సాహాన్ని నింపగలరా అనేదిఈ సభల విజయాపజయాలు నిర్ణయించనుంది. మొత్తానికి దూకుడుకు మారు పేరైన రేవంత్ రాజకీయ వ్యూహాలు ఈ కొత్త దూకుడుతో ఏం చేస్తారో చూడాలి.

# మంగళగిరిలో లోకేష్‌కు ప్రత్యర్థి ఎవరు?

# వైసీపీకి అసలు సమస్య అభ్యర్థా.. వ్యూహమా?



**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సొంత నియోజకవర్గం మంగళగిరిలో పట్టు కోసం వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 91 వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన మంత్రి లోకేశ్ నియోజకవర్గంలో పట్టు పెంచుకునేలా విస్తృతంగా పనిచేస్తుండగా, ఆయనకు సరైన ప్రత్యర్థిని రంగంలో దింపేందుకు వైసీపీ కూడా అదే స్థాయిలో వ్యూహాలు రచిస్తోందని అంటున్నారు. కూటమిలో కీలక నాయకుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు అయిన లోకేశ్ హవాను నిలువరించాలనే ఉద్దేశంతో వైసీపీ తాజాగా నియోజకవర్గం ఇంచార్జిని మార్పు చేసిందని చెబుతున్నారు. దీంతో గత మూడేళ్లలో ఐదోసారి మంగళగిరి వైసీపీ సమన్వయకర్తను మార్చినట్లైందని అంటున్నారు.

రాజధాని అమరావతి పరిధిలో ఉండటంతో మంగళగిరికి ప్రాధాన్యం ఒక్కసారిగా పెరిగిపోయింది. అదే సమయంలో రాష్ట్రమంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తుండటం, ఇదే నియోజకవర్గం పరిధిలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నివాసం, పార్టీ ప్రధాన కార్యాలయం కూడా ఉండటంతో సహజంగా మంగళగిరి రాజకీయాలు రాష్ట్రస్థాయిలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మరోవైపు మంత్రి లోకేశ్ గత ఎన్నికల్లో నిలవడం ఒక ఎత్తు అయితే, ఆ గెలుపును శాశ్వతంగా చేసుకునేలా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. ఇదే సమయంలో వైసీపీ కూడా తమ చేజారిన మంగళగిరిని తిరిగి కైవసం చేసుకోడానికి చాలా ప్రయత్నాలు చేస్తుందని అంటున్నారు. అయితే ఈ విషయంలో తరచూ ఇన్‌చార్జిలను మార్చుతుండటంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### కొత్తగా సోమిరెడ్డికి బాధ్యతలు

మంగళగిరి వైసీపీ సమన్వయకర్తగా బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిని నియమిస్తూ అధినేత జగన్మోహనరెడ్డి రెండు రోజుల క్రితం నిర్ణయం తీసుకున్నారు. సుమారు రెండేళ్లుగా పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న దొంతిరెడ్డి వేమారెడ్డిని తప్పించి అధినేత జగన్ రెడ్డి అనూహ్యంగా తీసుకున్న ఈ నిర్ణయం తీవ్ర చర్చకు దారితీస్తోంది. నిజానికి మంగళగిరి ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచిన ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీలోనే ఉన్నప్పటికీ అధినేత జగన్ రెడ్డి మాత్రం కొత్తవారిని తెరపైకి తెస్తూ లోకేశ్ కు దీటైన ప్రత్యర్థిని తయారు చేయాలని చూడటమే రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. 2024 ఎన్నికల వరకు నియోజకవర్గ వ్యవహారాలను ఆళ్ల రామకృష్ణారెడ్డి మాత్రమే చూసుకునేవారు. ఆయన ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అనూహ్యంగా రాజీనామా చేయడంతో అప్పటివరకు టీడీపీలో ఉన్న గంజి చిరంజీవిని పార్టీలోకి తీసుకుని ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే ఎన్నికల్లో పోటీకి ఆయనకు టికెట్ ఇవ్వకపోవడంతో వెంటనే రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. ఇక 2024 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కోడలు లావణ్యను పోటీకి పెట్టారు. ఎన్నికల తర్వాత లావణ్య స్థానంలో దొంతిరెడ్డి వేమారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు ఆయనను తప్పించి వేణుగోపాల సోమిరెడ్డిని నియమించడమే హాట్ టాపిక్ అవుతోంది.

### సరైన ప్రత్యమ్నాయం కోసమేనా?

తాజాగా వైసీపీ ఇన్‌చార్జిని మార్చడంపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. నియోజకవర్గంలో అధికార పార్టీ దూకుడుకు కళ్లెం వేయలేకపోతున్నారనే ఆలోచనతోనే కొత్తవారిని తెరపైకి తెచ్చారని అంటున్నారు. రాజకీయాలకు కొత్త అయిన వేణుగోపాలసోమిరెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పగిస్తే ఎటువంటి విమర్శలకు తావులేకుండా, అందరినీ కలుపుకుని పోయే అవకాశాలు ఉంటాయని పార్టీ అధిష్టానం భావించిందని అంటున్నారు. అయితే తరచూ ఇన్‌చార్జులను మార్చడం వల్ల ప్రయోజనం లేదని, మంత్రి లోకేశ్ వంటి బలమైన ప్రత్యర్థికి దీటుగా పార్టీ కూడా ఇన్‌చార్జులకు సహకరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికార బలంతోపాటు అంగ బలం, అర్థబలంతో లోకేశ్ ముందు దీటుగా నిలవాలంటే ఎవరికైనా పార్టీ పూర్తిస్థాయిలో అండదండగా నిలవాల్సివుందని అంటున్నారు. మంగళగిరి విషయంలో పార్టీ అధిష్టానం నుంచి ఇప్పటివరకు ఇలాంటి సహకారం అందడం లేదని కార్యకర్తలు చెబుతున్నారు.

### మంగళగిరిపై వైసీపీ జెండా ఎగరేయొచ్చా?

మంత్రి లోకేశ్ కు చెక్ చెప్పాలంటే వైసీపీ ఇన్‌చార్జి మార్పు ఒక్కటే సరిపోతుందా? అనేది ప్రస్తుతం హాట్ టాపిక్ అవుతోంది. ఈ విషయంలో వైసీపీ అధిష్టానం ఆలోచన కూడా మారాల్సివుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. గత ఎన్నికల తర్వాత మంగళగిరిలో లోకేశ్ పాతుకుపోయేలా పనిచేస్తుండగా, ఆయన కదలికలను గమనిస్తూ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేలా వైసీపీ పనిచేయాల్సివుందని అంటున్నారు. ఈ ఉద్దేశంతోనే ప్రస్తుత ఇన్‌చార్జిని మార్చినట్లు భావిస్తున్నారు. అయితే కొత్త వారిని ముందుకు నడిపేలా పార్టీ అధిష్టానం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. నిజానికి గత ఎన్నికల్లో కోల్పోయిన ఓట్లను తిరిగి పొందేందుకు పార్టీ అధిష్టానం ఫోకస్ చేయాల్సివుందని కార్యకర్తలు సూచిస్తున్నారు. ఇన్‌చార్జి ఒక్కరే కాకుండా ఏయే వర్గాల ఓటర్లు దూరమయ్యారు? ఎందుకు దూరమయ్యారు? అన్న కోణంలో ఆలోచించి, అందుకు తగిన వ్యూహాలు సిద్ధం చేయాల్సివుందని అంటున్నారు. పార్టీలో ఈ సన్నద్ధత లేకుండా ఇన్‌చార్జులను మార్చుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### గత ఎన్నికల్లోనే పెరిగిన టీడీపీ బలం

వైసీపీ ఆవిర్భవించిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో రెండుసార్లు మంగళగిరి నుంచి వైసీపీ గెలిచిందని గణాంకాలు చెబుతున్నాయి. గత ఎన్నికల్లోనే టీడీపీ ఇక్కడ గెలిచింది. అయితే 2014, 2019లో వైసీపీ గెలిచిన రెండుసార్లు ఆ పార్టీ స్వల్ప ఓట్లతోనే గట్టెక్కిందని అంటున్నారు. 2014లో కేవలం 12 ఓట్లతో ఈ స్థానాన్ని వైసీపీ గెలుచుకోగా, 2019లో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి హవాలోనూ సుమారు 5 వేల ఓట్లతో గెలిచిందని చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం టీడీపీపై పైచేయి సాధించాలంటే వైసీపీ వ్యూహాత్మకంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. నియోజకవర్గంలో దాదాపు మూడు లక్షల ఓటర్లు ఉండగా, గత ఎన్నికల్లో 2.53 లక్షల ఓట్లు పోలయ్యాయని చెబుతున్నారు. ఇందులో వైసీపీకి 76 వేల ఓట్లు పడ్డాయని లెక్కలు చెబుతున్నాయి. ఇక 2019 ఎన్నికల్లో సుమారు 1.08 లక్షల ఓట్లు సాధించి 5 వేల ఓట్ల మెజార్టీతో వైసీపీ గెలిచింది. అంతకుముందు ఎన్నికల్లో సుమారుగా 89 వేల ఓట్లు పొందింది. అప్పుడు టీడీపీకి కూడా అంతే సంఖ్యలో ఓట్లు పోలవ్వగా, పదేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ దాదాపు 1.67 లక్షల ఓట్లకు ఎగబాకిందని లెక్కలు చెబుతున్నాయి. అంటే మంగళగిరిలో టీడీపీని పడగొట్టేందుకు వైసీపీ ఓటుబ్యాంకు రెండింతలు పెరగాల్సివుందని అంటున్నారు. గత ఎన్నికల్లో కూటమి గాలిలోనూ 76 వేల ఓట్లు సాధించిన నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి అదనంగా మరో 76 వేల ఓట్లు పొందేలా వైసీపీ పనిచేయాల్సివుందని అంటున్నారు. అధిష్టానం ఈ దిశగా అడుగులు వేసినప్పుడే ఇన్‌చార్జులు కూడా మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉందని అంటున్నారు.

## అమరావతి ఔటర్ రింగ్ రోడ్ కు లైన్ క్లియర్

**విజయవాడ, సెప్టెంబర్ 29, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 189.93 కిలోమీటర్ల పొడవునా 6 లేన్లతో నిర్మించనున్న ఈ ఔటర్ రింగ్ రోడ్డు పనులను 4 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసి ఎన్‌హెచ్‌ఏఐ కి ప్రతిపాదనలు పంపించారు. ఈ రహదారితో పాటు నారాకోడూరు నుంచి గుంటూరు శివార్లలోని బుడంపాడు వరకు 5.2 కిలోమీటర్ల పొడవునా 4 వరుసల స్పర్ రోడ్డును కూడా అనుసంధానం చేయనున్నారు. దీంతో ఈ ప్రాజెక్టు మొత్తం పొడవు 195.13 కిలోమీటర్లకు చేరుకుంది. అమరావతి ఓఆర్ఆర్‌లో కృష్ణా నదిపై 2 వంతెనలు, 3 సొరంగాలు సహా అన్ని పనులు కలిపి 4 ప్యాకేజీలుగా విభజించారు. గతంలో ప్రతి 25 నుంచి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 6 నుంచి 8 ప్యాకేజీలుగా నిర్మించాలని మొదట భావించినప్పటికీ, పనుల పర్యవేక్షణ సులభతరం చేసేందుకు ప్యాకేజీల సంఖ్యను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు.మొదటి ప్యాకేజీ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వద్ద విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి ప్రారంభమై కొండపల్లి, పంగిడి అటవీ ప్రాంతాల మీదుగా మైలవరం వరకు (27వ కిలోమీటర్) సాగుతుంది. ఇందులో 2 సొరంగాలు ఉంటాయి. అలాగే చివర్లో ఉండే 189వ కిలోమీటర్ నుంచి 189.93 కిలోమీటర్ వరకు ఉన్న పనులను ఈ మొదటి ప్యాకేజీలోనే చేర్చారు. రెండో ప్యాకేజీ మైలవరం 27వ కిలోమీటర్ నుంచి కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను సమీపంలోని 83వ కిలోమీటర్ వరకు మొత్తం 56 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది.మూడో ప్యాకేజీ కోలవెన్ను 83వ కిలోమీటర్ నుంచి ప్రారంభమై గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట సమీపంలోని 133.5వ కిలోమీటర్ వరకు 50.5 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ ప్యాకేజీలో అదనంగా నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు ఉండే 5.2 కిలోమీటర్ల కనెక్టింగ్ రోడ్డుతో పాటు, వల్లూరుపాలెం వద్ద కృష్ణానదిపై 4.8 కిలోమీటర్ల పొడవైన వంతెన నిర్మించనున్నారు. నాలుగో ప్యాకేజీ పుల్లడిగుంట (133.5 కి.మీ) దగ్గర మొదలై ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల సమీపంలోని 189వ కిలోమీటర్ వరకు 55.5 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ ప్యాకేజీలో పేరేచర్ల వద్ద 400 మీటర్ల సొరంగం, మున్నలూరు వద్ద కృష్ణానదిపై 3.15 కిలోమీటర్ల మేర వంతెన ఉంటాయి.ఈ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్ట్ మొత్తం అంచనా వ్యయం రూ.30,491 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 4 ప్యాకేజీలకు కలిపి సివిల్ పనుల నిమిత్తం రూ.10,595.70 కోట్లు అవసరమని అంచనా వేశారు. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.5,315 కోట్లు నిధులు కేటాయించారు. మిగిలిన నిధులను పర్యావరణ, అటవీ అనుమతుల ఖర్చులు, విద్యుత్ లైన్ల తరలింపు, మరియు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద 15 ఏళ్లపాటు వడ్డీతో కూడిన చెల్లింపుల నిమిత్తం వినియోగించనున్నారు.

## కాపులకు వైసీపీ గాలం

**విజయవాడ, సెప్టెంబర్ 29, పెన్ పవర్:**
ఏపీ రాజకీయాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ తన ఉనికిని చాటుకోవడానికి, కూటమి ఐక్యతను దెబ్బతీయడానికి అనేక మార్గాలను అన్వేషిస్తోంది. అందులో భాగంగానే రాబోయే రోజుల్లో కూటమిలోని కీలక భాగస్వామి అయిన జనసేనను, దాని మూలస్తంభమైన సామాజికవర్గాన్ని టార్గెట్ చేయడం ఒక వ్యూహాత్మక ప్రాధాన్యతగా మారింది.తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో చోటుచేసుకున్న వంగవీటి రంగా విగ్రహ వివాదం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. నియోజకవర్గ పరిధిలోని స్థానిక సెంటిమెంట్లను రగిల్చి, దాని ద్వారా కూటమిలోని పార్టీల మధ్య -- ప్రత్యేకించి టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య -- అపోహలు సృష్టించేందుకు వైసీపీ సిద్ధం చేసిన ఒక రాజకీయ ప్రణాళిక అని జరిగిన దాన్ని బట్టి చూస్తే అర్థమైపోతుంది.ఏదైనా ప్రాంతంలో విగ్రహాల ఏర్పాటుకు స్థానిక పరిపాలనా అనుమతులు తప్పనిసరి. కానీ, స్థానిక అధికారులు మంత్రి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకునే లోపే, అనుమతుల కాలయాపనను నెపంగా చూపి రాత్రికి రాత్రే విగ్రహాన్ని పెట్టేయడం వెనుక స్పష్టమైన ఉద్దేశం కనిపిస్తోంది. విగ్రహం తొలగింపు పరిణామాలను తమ రాజకీయ లబ్ధికి వాడుకోవాలనేది ఇక్కడ వ్యూహం. ఈ క్రమంలోనే రాజకీయ అరంగేట్రం కోసం వేచి చూస్తున్న వంగవీటి ఆశాకిరణ్ వంటి నాయకులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని భావోద్వేగపూరితమైన వ్యాఖ్యలు చేయడం, రాజకీయాన్ని తీవ్రతరం చేయడం గమనార్హం. ప్రజా సమస్యలపై కాకుండా విగ్రహ రాజకీయాలపై ఆత్రుత చూపడం వెనుక ఉన్న స్వార్థం ప్రజలకు స్పష్టంగానే అర్థమవుతోంది.ఈ ఉదంతం వెనుక ఉన్న ప్రధాన కుట్ర కూటమిలోని జనసేన ఓటు బ్యాంకును వేరు చేయడం. టీడీపీ పాలన వల్ల రంగా విగ్రహానికి అన్యాయం జరిగిందనే ప్రచారాన్ని హోరెత్తించడం ద్వారా ఆ వర్గం యువతలో అసంతృప్తి రగల్చాలని వైసీపీ భావిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందనే నిజాన్ని మరిపించి, కేవలం కుల కోణాన్ని మాత్రమే ముందుకు నెట్టడం ద్వారా జనసేనకు లభించే సామాజిక మద్దతును బలహీనపరచడమే దీని అంతిమ లక్ష్యం. కాపు సెంటిమెంట్‌ను జనసేన నుండి వేరు చేస్తే తప్ప, ఆ పార్టీ రాజకీయ బలహీనత సాధించలేమనే అంచనాతోనే వైసీపీ ఈ రకమైన వ్యూహాలకు పదును పెడుతోంది.రాజకీయంగా ఇప్పుడిప్పుడే ప్రాధాన్యత పొందుతూ, సమ్మిళిత అధికారంలో కీలక పాత్ర పోషిస్తున్న ఒక వర్గానికి లేదా పార్టీకి ఇలాంటి వివాదాలు పెద్ద అగ్నిపరీక్ష వంటివి. అధికారంలో ఉన్నప్పుడు ఏ కొద్దిపాటి తొందరపాటు లేదా అతిగా స్పందించే ధోరణి కనిపించినా, అది ఇతర వర్గాల్లో ప్రతికూల భావన పెరిగేలా చేస్తుంది. తాము అధికారంలో ఉన్నామన్న భావనతో క్షేత్రస్థాయి శ్రేణులు సంయమనం కోల్పోతే, అది మిగిలిన సామాజికవర్గాలను దూరం చేసే ప్రమాదం ఉంది. ప్రత్యర్థులు పన్నిన ఈ కుల రాజకీయ వలలో చిక్కుకోకుండా ఉండాలంటే, భావోద్వేగాల కంటే పరిపక్వతతో కూడిన నిశ్శబ్ద వ్యూహం చాలా అవసరం.వైసీపీ విసిరిన ఈ విగ్రహ రాజకీయం నుంచి పాఠాలు నేర్చుకోవాల్సింది కూటమి నాయకత్వమే. చిన్న విషయాలను సైతం పెద్ద వివాదాలుగా మార్చేందుకు ప్రతిపక్షం సిద్ధంగా ఉందనే వాస్తవాన్ని గుర్తించాలి. అధికారంలో ఉన్న పక్షాలు ముందస్తుగా చట్టబద్ధమైన పరిష్కారాలు చూపాలి తప్ప, వివాదాలు పెరిగే వరకు వేచి చూడకూడదు. కాపు ఓటు బ్యాంకుతో పాటు ఇతర వర్గాల మద్దతును సమతుల్యంగా కాపాడుకోవాలంటే, జనసేన శ్రేణులు తీవ్ర సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, ప్రత్యర్థులు ఆశించినట్లుగానే సామాజిక సమీకరణాలు దెబ్బతిని, అంతిమంగా రాజకీయంగా ఎదిగుతున్న వర్గానికే కోలుకోలేని నష్టం జరుగుతుంది. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయన్న సంగతిని ఎవరూ మర్చిపోకూడదు.

## డైరక్ట్ ఎన్నికలతో ఇబ్బందులేనా

**నెల్లూరు, సెప్టెంబర్ 29, పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం మున్సిపల్ చట్టాలకు సవరణలు చేస్తూ మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్‌లను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించడం వైసీపీ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తోంది. పరోక్ష ఎన్నికల విధానంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలిపించుకుని, అనంతరం రాజకీయ సమీకరణాలతో , క్యాంప్ రాజకీయాలతో మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి , కనీసం గట్టి పోటీ ఇవ్వడానికి అవకాశముండేది. వార్డుల వారీగా పరిమిత శక్తిని ఉపయోగించి కొన్ని స్థానాలు గెలిచినా పార్టీ ఉనికి ఉందనే " సంకేతాలు ఇచ్చే అవకాశం దక్కేది. అయితే, నగర లేదా పట్టణ స్థాయి మొత్తాన్ని ఒకే నియోజకవర్గంగా భావించి జరిగే ఈ ప్రత్యక్ష పోరులో విజయం సాధించాలంటే విస్తృతమైన ప్రజాదరణతో పాటు సమగ్రమైన యంత్రాంగం అవసరం. ఇది ప్రతిపక్షంలో ఉన్న వైసీపీకి అతిపెద్ద సమస్యగా మారింది.మేయర్ , ఛైర్మన్ స్థాయి ప్రత్యక్ష ఎన్నికలంటే నగరమంతటా ప్రచారం నిర్వహించడం, భారీ ఎత్తున ఆర్థిక, అంగబలాలను సమకూర్చుకోక తప్పదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీల వైపు నుంచి నగరాల్లో పోటీకి బలమైన ఆర్థిక సామర్థ్యం, సామాజిక మద్దతు ఉన్న నేతలు సులభంగానే సిద్ధమవుతున్నారు. మరోవైపు ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ తరపున అంత భారీగా ఖర్చు పెట్టి, అధికార యంత్రాంగాన్ని ఎదుర్కొని పోరాడేందుకు ఆ స్థాయి హెవీవెయిట్ అభ్యర్థులు లభించడం కష్టంగా మారింది. పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నవారు కూడా భారీగా సొంత నిధులు వెచ్చించడానికి వెనుకంజ వేస్తుండటంతో, ప్రధాన నగరాల్లో పరువు నిలబెట్టుకునే స్థాయిలో బలమైన అభ్యర్థులను ఖరారు చేయడం పార్టీ నేతలకు పెద్ద సవాలుగా మారింది.గతంలో వార్డు స్థాయి ఎన్నికల్లో స్థానిక బలగాలు, వ్యక్తిగత సంబంధాలు పనిచేసేవి. కానీ ఇప్పుడు మేయర్, మున్సిపల్ ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికల వల్ల ఓటర్ల దృష్టి వార్డు సభ్యుల కంటే ప్రధాన పదవిపైనే ఎక్కువ కేంద్రీకృతమవుతుంది. నగరవ్యాప్తంగా అధికార పార్టీ వీచే గాలి , అభ్యర్థి ప్రాభవం ఆటోమేటిక్‌గా కింద ఉన్న వార్డు కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలపై కూడా ప్రభావం చూపుతుంది. మేయర్ అభ్యర్థికి గెలుపు అవకాశాలు లేవని భావిస్తే, అది కింది స్థాయి వార్డు అభ్యర్థుల ప్రచారంపై, అలాగే ఓటర్ల మూడ్‌పై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ సమగ్ర ప్రభావం వల్లనే పలు పట్టణాల్లో వైసీపీకి చెందిన కింది స్థాయి క్యాడర్ వార్డు స్థాయి పోటీని కూడా తీవ్రంగా తీసుకోలేని నైరాశ్యంలోకి జారుకుంటోంది.ప్రత్యక్ష ఎన్నికల విధానంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యక్ష ఎన్నికలు రావడం మంచిదేనని స్పందించారు. అయితే, పార్టీ క్షేత్రస్థాయి బలాబలాలు, నగర ప్రాంతాల్లో ఉండే ప్రతికూల వాతావరణం, అలాగే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎదురయ్యే వనరుల కొరతను లోతుగా విశ్లేషించకుండానే అధినేత ఆ ప్రకటన చేశారని పార్టీ సీనియర్ నేతలు మథనపడుతున్నారు. నాయకులకు కేవలం ఆదేశాలు ఇవ్వడమే తప్ప, ప్రతిపక్షంలో ఉన్న ఈ క్లిష్ట సమయంలో అభ్యర్థులకు అవసరమైన ఆర్థిక లేదా క్షేత్రస్థాయి రక్షణ బాధ్యతను పార్టీ కేంద్ర నాయకత్వం ప్రత్యక్షంగా తీసుకుంటుందనే స్పష్టమైన అభయాన్ని ఇవ్వలేకపోతున్నారు. అందుకే లోకల్ పోరును సీరియస్‌గా తీసుకోకుండా నామమాత్రంగా వైసీపీ క్యాడర్ పరిగణిస్తోంది.

# జనసేనకు కల్ట్ పొలిటికల్ ఇమేజ్

**కాకినాడ, సెప్టెంబర్ 29, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రమంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని సాధించిన కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీలోకి ప్రస్తుతం ఇతర పార్టీల, ముఖ్యంగా ప్రతిపక్ష వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి, నియోజకవర్గ స్థాయి నేతల నుంచి భారీగా చేరికలు సాగుతున్నాయి. ఓటమి భారం, భవిష్యత్తుపై అస్పష్టతతో తీవ్ర అంతర్మథనంలో ఉన్న వైసీపీ నేతలు జనసేన వైపు చూపుతుండటంతో, రాష్ట్రంలో వైసీపీకి పూర్తిస్థాయి ప్రత్యామ్నాయాన్ని జనసేన ఆక్రమించే అవకాశం ఉందా అనే అంశంపై చర్చలు ప్రారంభమయ్యాయి.ఉత్తరాంధ్ర నుంచి నెల్లూరు వరకు కూటమి కారణంగా వైసీపీ రాజకీయ పునాదులు గణనీయంగా బలహీనపడ్డాయనేది కొట్టిపారేయలేని నిజం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకోవడం సులభం కాదన్న భావనతో క్షేత్రస్థాయి శ్రేణులు, నాయకులు కొత్త రాజకీయం కోసం వెతుకులాడుతున్నారు. ఈ క్రమంలో అధికారంలో ఉండటంతో పాటు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవ, సాధిస్తున్న ఇమేజ్ చాలామందికి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. కేవలం నియోజకవర్గ నేతల చేరికలే కాకుండా, పూర్తిస్థాయిలో లీడర్లను, క్యాడర్‌ను నిలకడగా పార్టీలోకి తెచ్చుకోగలిగితేనే ఈ వలసలు రాజకీయ బలంగా మారేందుకు ఆస్కారం ఉంటుంది.గతంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకును, స్థానిక నేతలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏ రకంగానైతే క్రమంగా తన వైపు తిప్పుకొని సొంత సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారో, ఇప్పుడు పవన్ కళ్యాణ్ కూడా వైసీపీ వద్ద ఉన్న అసంతృప్తికరమైన ఓటు బ్యాంకును, ఆ పార్టీ క్యాడర్‌ను తనవైపు మళ్లించుకోవాల్సిన వ్యూహాత్మక అవసరం ఉంది. ఓటు బ్యాంకు అనేది కేవలం చేరికలతోనే మారదు. దానికి క్షేత్రస్థాయిలో నమ్మకాన్ని కల్పించే సంస్థాగత నిర్మాణం అవసరం. వైసీపీ శ్రేణులు జనసేన సిద్ధాంతాలను, పవన్ నాయకత్వాన్ని స్వీకరించి, వారంతా శాశ్వత ఓటర్లుగా మారేలా సరైన రోడ్‌మ్యాప్ రూపొందించుకుంటేనే ప్రత్యామ్నాయ రాజకీయం రూపుదిద్దుకుంటుంది. జనసేన ప్రత్యామ్నాయంగా ఎదగడానికి ప్రధాన అడ్డంకి, సంక్లిష్టత ప్రస్తుతం ఉన్న కూటమి రాజకీయాలే. టీడీపీతో కలిసి ప్రభుత్వం నిర్వహిస్తున్న వేళ, వైసీపీకి వ్యతిరేకంగా పోరాటంలో తన స్వతంత్రతను కాపాడుకుంటూనే, పొత్తుకు విఘాతం కలగకుండా నాయకులను చేర్చుకోవడం ఒక కత్తిమీద సాము. ముఖ్యంగా కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో టీడీపీతో ఎలాంటి ఘర్షణాత్మక వాతావరణం రాకుండా, వైసీపీ ఓటు బ్యాంకునూ, లీడర్లనూ తన గూటికి చేర్చుకోవడంలో జనసేన అనుసరించే రాజకీయంపైనే పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.పవన్ కళ్యాణ్‌కు ఉన్న అపారమైన వ్యక్తిగత క్రేజ్, కల్ట్ ఇమేజ్ స్థిరమైన రాజకీయ శక్తిగా మారాలంటే నిలకడైన ప్రజాదరణతో పాటు పక్కా సంస్థాగత బలం తోడవాలి. వైసీపీ ఓటు బ్యాంకును, స్థానిక నాయకత్వాన్ని పకడ్బందీగా స్వీకరించి, రాయలసీమతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బలమైన పార్టీ క్యాడర్‌ను నిర్మించిన రోజున -- పవన్ తన అసలైన కల్ట్ రాజకీయ పవర్‌ను చూపించే అవకాశం లభిస్తుంది. ఒకవేళ ఈ ఫ్లో ఇలాగే కొనసాగి, వైసీపీలోని ఖాళీని జనసేన భర్తీ చేయగలిగితే, రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాలు టీడీపీ-వైసీపీ పోరు నుంచి టీడీపీ వర్సెస్ జనసేన వైపు మారినా ఆశ్చర్యపోనవసరం లేదు.

# మంత్రివర్గంలో నో సీనియర్స్

**విజయవాడ, సెప్టెంబర్ 29, పెన్ పవర్:**
మరికొద్ది రోజుల్లో ఏపీ మంత్రి వర్గ విస్తరణ ఉండనుందన్న ప్రచారం ఊపందుకుంది. రెండున్నరేళ్లు ముగిసిన తర్వాత కేబినెట్ మార్పులపై టీడీపీలో ఇప్పటి నుంచి చర్చ జరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గాన్ని ఇలా ఎంపిక చేయడం వెనక కూడా దూరాలోచన ఉందని అంటున్నారు. రానున్న మంత్రి వర్గ విస్తరణలో కూడా సీనియర్లకు అవకాశం ఉండదన్న వాదన వినిపిస్తుంది. మరోసారి జూనియర్లకే అవకాశం ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు కారణాలు కూడా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి వర్గ కూర్పులో సాంప్రదాయ రాజకీయ సమీకరణాలకు భిన్నంగా, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత వ్యూహాత్మక ఆలోచనలతో మంత్రులను ఎంపిక చేశారు. సీనియర్లను పక్కనపెట్టి మరీ ఎక్కువ మంది కొత్తవారికి చోటు కల్పించడం వెనుక ఆయనకున్న ప్రధాన ఆలోచనలు, వ్యూహాలు అనేకం ఉండొచ్చు. కొత్త నాయకత్వాన్ని తయారు చేయడం ఇందుకు ఉదాహరణ. మంత్రివర్గంలో మొత్తం 24 మంది మంత్రులలో 17 మంది కొత్తవారికి అవకాశం కల్పించారు. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన పదిమందికి పైగా నేరుగా మంత్రి పదవులు దక్కాయి. రాబోయే కొన్ని దశాబ్దాల పాటు టు పార్టీని, రాష్ట్రాన్ని నడిపించగల సమర్థులైన ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ఇప్పుడే తయారు చేయాలనేది చంద్రబాబు సుదీర్ఘ వ్యూహమని చెబుతున్నారు.. బీసీలకు పెద్దపీటమంత్రివర్గంలో వెనుకబడిన తరగతులకు 8 పదవులు, కాపులు మరియు కమ్మ సామాజిక వర్గాలకు చేరో 4 పదవులు, ఎస్సీలకు 3, ఎస్టీ మరియు మైనారిటీలకు ఒక్కో పదవి చొప్పున కేటాయించారు.ఆలోచన: టిడిపికి సాంప్రదాయకంగా అండగా ఉండే బీసీలకు ఈసారి కూడా పెద్దపీట వేయడం ద్వారా సామాజిక సమతూకాన్ని పాటించారు. అంతేకాకుండా మహిళలకు, గిరిజన ప్రాంతాలకూ ప్రాతినిధ్యం కల్పించారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బుచ్చయ్య చౌదరి, కన్నా లక్ష్మీనారాయణ వంటి హేమాహేమీ సీనియర్లను మంత్రివర్గంలోకి తీసుకోలేదు.ఆలోచన: సీనియర్లను కేవలం పరిపాలనకే పరిమితం చేయకుండా, వారి అనుభవాన్ని పార్టీ సంస్థాగత బలోపేతానికి మరియు శాసనసభ వ్యవహారాల నిర్వహణకు వాడుకోవాలనేది చంద్రబాబు ఆలోచన. పర్ఫార్మెన్స్ ఆధారిత పాలనమంత్రివర్గాన్ని ఎంపిక చేసిన తర్వాత కూడా చంద్రబాబు మంత్రుల పనితీరుపై నిరంతరం సమీక్షలు జరుపుతున్నారు. మంత్రులకు అంతర్గతంగా ర్యాంకులు ఇవ్వడం ద్వారా వారిలో పోటీతత్వాన్ని పెంచుతున్నారు. గత ప్రభుత్వం వల్ల దెబ్బతిన్న వ్యవస్థలను బాగు చేయాలన్నా, కేంద్ర నిధులను రాబట్టాలన్నా మంత్రులు నిరంతరం క్రియాశీలకంగా ఉండాలనేది ఆయన ఆలోచనఅని చెబుతున్నారు. కేవలం పదవుల అనుభవం కోసం కాకుండా డెలివరీ ఆధారంగానే మంత్రుల భవిష్యత్తు ఉంటుందని బాబు స్పష్టం చేశారు. మొత్తంగా చూస్తే, చంద్రబాబు నాయుడు ఈసారి కేవలం రాజకీయ లెక్కల కోసమే కాకుండా, వేగవంతమైన అభివృద్ధి, సమర్థవంతమైన పాలన , మరియు పార్టీ భవిష్యత్తు పునాది అనే త్రివిధ వ్యూహంతోనే ఈ మంత్రుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారని, రేపు మంత్రి వర్గ విస్తరణ జరిగినా ఇలాగే ఉంటుందని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# వలస జీవుల ఆశల సమరం.. అమెరికాలో ఉద్యోగం పోతే ఇల్లు వదిలి భారత్‌కు రావాల్సిందేనా?



ఒక స్వప్నం... దశాబ్దాల కష్టం... రెక్కలు ముడుచుకుని మాతృభూమికి చేరే క్షణం ఎంత వేదన భరితంగా ఉంటుందో ఊహించగలమా? ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని పోస్టులు పదుల సంఖ్యలోని భారతీయుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. అమెరికాలోని ఒక ఇంట్లో ఫర్నిచర్, పిల్లల బొమ్మలు, సామాన్లు యథావిధిగా వదిలేసి ఓ కుటుంబం భారత్‌కు తిరిగి వెళ్లిపోయిందన్న దృశ్యాలు ప్రవాస భారతీయులను.. ఇక్కడున్న వారి కుటుంబాలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. అసలు ఈ వైరల్ పోస్టుల వెనుక ఉన్న నిష్టుర సత్యమేమిటి? అన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

సముద్రం దాటి వెళ్లిన ప్రతీ హెచ్-1బీ ఉద్యోగి కథ వెనుక ఒక పెద్ద త్యాగం ఉంటుంది. రాత్రింబవళ్లు కష్టపడి.. డాలర్ల కలలను నిజం చేసుకుంటూ.. కష్టపడి సంపాదించిన డబ్బుతో అమెరికా నేలపైన ఒక సొంతింటిని నిర్మించుకుంటారు. ఆ ఇంట్లోని ప్రతీ మూల ఒక జ్ఞాపకమే. కానీ ఒక్క టెక్ కోత... లేదా ఒక్క వీసా రద్దు వారి జీవితాలను తలకిందులు చేస్తుంది. హెచ్1బీ ఉద్యోగం పోయిన తర్వాత ఇచ్చే ఆ 60 రోజుల గడువు ఒక రకమైన కౌంట్‌డౌన్ లాంటిది. ఆ గడువులోగా ఇంకో స్పాన్సర్ దొరక్కపోతే దశాబ్దాల ప్రయాణాన్ని మూటగట్టుకుని దేశం విడిచి వెళ్లక తప్పదు.అయితే సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు అందరూ ఇళ్లను.. ఆస్తులను అనాథలుగా వదిలేసి పారిపోతున్నారా అంటే అది పూర్తిగా నిజం కాదు. ఒక ఇంటిని అమ్మడం లేదా అద్దెకు ఇవ్వడం అనేది రాత్రికి రాత్రే జరిగే ప్రక్రియ కాదు. మార్కెట్ పరిస్థితులు బాగోలేనప్పుడు.. లోన్ బకాయిలు ఎక్కువ ఉన్నప్పుడు కొన్ని కుటుంబాలు అత్యవసర పరిస్థితిలో తీవ్ర నష్టాలను భరించాల్సి వస్తుంది. ఒకవేళ ఇల్లు వదిలి వెళ్లినా.. ఆ అప్పులు ఆటోమేటిక్‌గా రద్దు కావు. చట్టపరమైన ఫోర్‌క్లోజర్ ప్రక్రియలు, బ్యాంకింగ్ చర్యలు వారిపై కొనసాగుతూనే ఉంటాయి. గతంలో 2000 నాటి డాట్‌కామ్ సంక్షోభం.. 2008 నాటి తీవ్ర ఆర్థిక మాంద్యం సమయంలోనూ ఇటువంటి కష్టకాలం వచ్చింది. నాటి జ్ఞాపకాలు నేటికీ గాయాలుగానే మిగిలాయి. కానీ ఒక్క వైరల్ పోస్ట్ ను చూసి అమెరికాలోని ప్రతి భారతీయ హెచ్1బీ కుటుంబం తీవ్ర సంక్షోభంలో ఉందనుకోవడం తొందరపాటే అవుతుంది.వైరల్ అయ్యే పోస్టులు, వీడియోలు కేవలం ఆందోళనను భావోద్వేగాలను పెంచగలవు. కానీ ప్రవాస భారతీయుల అసలు పోరాటం చట్టం, ఇమ్మిగ్రేషన్ నిబంధనలు, గ్రీన్ కార్డ్ నిరీక్షణ, ఉద్యోగ భద్రతలతో ముడిపడి ఉంది. ఎన్ని కష్టాలు ఎదురైనా ఎన్ని రాత్రులు నిద్రలేకుండా గడిపినా... మళ్లీ నిలదొక్కుకునే ఆత్మవిశ్వాసమే మన భారతీయుల అతిపెద్ద బలం. భయం కన్నా వాస్తవాలను గ్రహించి సరైన చట్టపరమైన నిర్ణయాలు తీసుకోవడమే ఈ క్లిష్ట సమయం నుంచి గట్టెక్కించే ఏకైక మార్గం.

# ట్రంప్ తెలివే తెలివి: పన్నులు పెంచి పెట్టుబడులు రాబట్టారా?



రాష్ట్రాలకైనా.. దేశాలకైనా పెట్టుబడులు రావాలంటే.. ప్రభుత్వాలు కొన్ని మెట్లు దిగి వస్తాయి. పెట్టుబడి దారులకు అనుకూల విధానాలను రూపొందిస్తాయి. పన్నులు తగ్గిస్తాయి.. రాయితీలు పెంచుతాయి. ప్రస్తుతం ఏపీ, తెలంగాణ ల్లో జరుగుతున్న విధానాలు ఇవే. ఇక, కేంద్ర ప్రభుత్వంకూడా.. అనేక రాయితీలు ఇస్తోంది. పెట్టుబడులు పెట్టేవారి కి రెడ్ కార్పెట్ పరుస్తోంది. అయితే.. దీనికి భిన్నంగా పరిశ్రమ దారులను, పెట్టుబడి దారులను బెదిరించి లొంగ దీసుకోవడం.. వారితో పెట్టుబడులు పెట్టించడం అనేది ఎక్కడా లేదు.కానీ, ఈ విధానం కూడా తనకు సాధ్యమేనని అంటున్నారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. తాజాగా భారత్‌కు చెందిన ఎస్సార్ గ్రూప్ సంస్థ అమెరికాలో పెట్టుబడి పెట్టనుంది. ఈ విషయాన్ని ట్రంపే స్వయంగా వెల్లడించారు. ఐరన్ ఫ్యాక్టరీని ఈ సంస్థ అమెరికాలో ఏర్పాటు చేయనుంది. దీనికిగాను భారత కరెన్సీలో లక్షా 40 వేల కోట్ల రూపా యలను పెట్టుబడిగా పెట్టనుంది. తద్వారా 2 వేల మందికి ఉద్యోగాలు.. అంతే సంఖ్యలో కార్మికులకు ఉపాధి వంటి వి లభించనున్నాయి. అయోవా రాష్ట్రంలో ఈ సంస్థ ఏర్పాటు కానుంది.

అమెరికా చరిత్రలో అతి పెద్ద రెండో విదేశీ పెట్టుబడి ఇదే కావడం గమనార్హం. ఈ విషయాన్నే ట్రంప్ చెప్పుకొచ్చారు. ఈ పెట్టుబడితో దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, పెట్టుబడిదారులు కూడా అమెరికాకు -క్యూ- కడతారని ఆయన పేర్కొన్నారు. అదేసమయంలో ట్రంప్ మద్దతుదారులు, కొందరు మంత్రులు ఈ విషయంపై దూకుడు వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ సుంకాలు, పన్నుల కొరడా ఝుళిపించబట్టే.. విదేశీ పెట్టుబడులువస్తున్నాయని వ్యాఖ్యానించారు.విదేశీ వస్తువులపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా సుంకాలు కట్టుకునే బదులు.. అమెరికాలోనే సంస్థలను స్థాపిస్తే బెటర్ అని భావిస్తున్నారని.. అందుకే ఎస్సార్ సంస్థ అమెరికా లో పెట్టుబడులు పెడుతోందని అన్నారు. ఇక, అమెరికాలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు జీరో సుంకాలు, పన్నుల్లో రాయితీ వంటివి ఇస్తున్న విషయం తెలిసిందే.అయితే.. ఇతర దేశాల్లో మాదిరిగా అమెరికాలో వ్యాపారం చేయాలంటే.. పక్కాగా నిబంధనలు పాటించాలి. పనికి తగిన వేతనంకాదు.. నిర్దేశిత వేతనం ఇవ్వాలి. సమయ పాలన పాటించాలి. దీంతో విదేశీపెట్టుబడి దారులు, ముఖ్యంగా భారత్‌కు చెందిన సంస్థలు అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు వెనుకాడుతుంటాయి. కానీ, సుంకాల ఎఫెక్ట్‌తో ఇప్పుడు అమెరికాబాటపట్టడం గమనార్హం.

# సందట్లో సడేమియా.. ఎల్.పీ.యూలో సాగిన ఓ 'దోపిడీ' కథ



కోపంలో ఉన్న వాడు ఏమైనా చేస్తాడు.. పిచ్చోడి చేతిలో రాయిలాగా అనే సామెతను కొందరు డిస్కౌంట్ ఆఫర్ లా ఆ యూనివర్సిటీలో సొమ్ముచేసుకున్నారు. న్యాయం కోసం ధర్నా చేద్దామని రోడ్డెక్కిన కొందరు కిలాడీ ఆందోళనకారులు.. మధ్యలోనే అసలు లక్ష్యాన్ని మార్చి బ్రాండెడ్ ల్యాప్ ట్యాప్ లు.. తాజా మోడల్ ఫోన్లు, స్టైలిష్ షూలు ఎత్తుకెళుతుంటే నిరసనకు.. మిడ్ నైట్ ఆఫర్ సెల్ కి తేడా తెలియక స్థానిక వ్యాపారులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

సందట్లో సడేమియాలాగా విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ అంటూ పంజాబ్ లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్.పీ.యూ)లో చెలరేగిన హింసాకాండ కొందరికి దోపిడీకి ఆయుధమైంది. హాస్టల్ లో ఓ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ జరిగిందన్న ఆరోపణలు రావడంతో ఊహించని మలుపు తిరిగింది. న్యాయం దక్కాలి అంటూ రోడ్డెక్కిన విద్యార్థులు చివరకు షాపుల అద్దాలు పగలగొట్టాలి అనేంతగా హింసాత్మకంగా మార్చింది. దొరికినవి దొరికనట్టు షాపులను బద్దలు కొట్టారు. సెప్టెంబర్ 27 అర్ధరాత్రి హైవేపై ధర్నాలు, రాళ్ల దాడులతో వాతావరణం బాగా వేడెక్కేసింది.

అయితే అంతవరకూ బాగానే ఉంది కానీ.. ఆ రగడ మధ్యలో ఉన్నట్టుండి జలందర్ -ఫగ్వారా హైవేపై ఉన్న మాల్స్, దుకాణాల వైపు కొందరు అడుగులు వేశారు. అల్లర్ల ముసుగులో బ్రాండెడ్ ల్యాప్ ట్యాప్ లు.. తాజా మోడల్ మొబైల్ ఫోన్లు, స్టైలిష్ షూలు, ట్రెండీ బట్టలు ఎత్తుకెళ్లారు. ఈ తీరు చూస్తుంటే విద్యార్థుల నిరసనలకు.. ఉచిత వింటర్ సేల్ కి తేడా లేకుండా పోయిందన్న సెటైర్లు వినిపించాయి. అసలు ఈ నిరసనలకు ఏ సంబంధం లేని హైవేపై షాపుల యాజమానులు తమ సరుకు మాయమై, అద్దాలు ముక్కలవ్వడంతో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

ప్రస్తుతం పోలీసులు, సిట్ దర్యాప్తు బృందం యూనివర్సిటీలో ఏం జరిగిందన్న దానిపై క్లారిటీకి రాలేదు. వివిధ సెక్షన్ల కింద కేసులు అయితే పెట్టారు. ఫోరెన్సిక్ టీంలు రంగంలోకి దిగాయి. యూనివర్సిటీ యాజమాన్యం మాత్రం 'గ్యాంగ్ రేప్' లాంటిది జరగలేదు అంటూ క్లారిటీ ఇచ్చారు. విద్యార్థినుల చేత ఓ వీడియో కూడా విడుదల చేయించారు.

అయితే ట్విస్ట్ ఏంటంటే.. ఆ చెప్పిన విద్యార్థినులు 'మాతో బలవంతంగా చెప్పించారు' అని ఆరోపించడంతో ఈ కథ మొదటికొచ్చింది.

దీంతో ఈ ట్విస్ట్ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తోంది. నిజనిజాలు తేలడానికి సమయం పడుతుంది..

కానీ ఈలోపే హైవేపై ట్రాఫిక్ నిలిపివేయడం.. పబ్లిక్ ప్రాపర్టీని ధ్వంసం చేయడం.. ఆర్టీసీ బస్సులు.. పోలీసుల వాహనాలకు నిప్పు పెట్టడం.. ఏ తరహా విప్లవమో ఎవరికీ అర్థం కావడం లేదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని కనపడిన ప్రతీ దాన్ని తలబెడితే నచ్చిన వస్తువును ఎత్తుకెళితే బాధితురాలికి న్యాయం జరుగుతుందా? లేక షాపింగ్ కోరిక తీరుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రస్తుతం యూనివర్సిటీ క్యాంపస్ కు 10 రోజుల పాటు సెలవులు ప్రకటించి.. పరీక్షలను వాయిదా వేసి అందరినీ ఇళ్లకు సాగనంపింది. ప్రస్తుతం మూడంచెల దర్యాప్తు నడుస్తోంది. అర్ధరాత్రి జరిగిన 'ఫ్రీ షాపింగ్' దోపిడీలపై దర్యాప్తు సాగుతోంది. నిరసనల్లో అసలు దోషులు ఎవరో తేలేలోపే.. అమాయకులు నష్టపోవడం సమాజంలో విచిత్రమైన ధోరణికి అద్దం పడుతోంది. న్యాయపోరాటానికి, లూటీకి మధ్య ఉన్న తేడాను ఇప్పటికైనా గుర్తించి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# మేనమామ కానుక.. విలువ రూ.756 కోట్లు!!

# తమిళనాడులో విజయ్ సంచలనం



తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక జనాకర్షక విధానాలు అవలంబిస్తూ కొత్త రికార్డులు సృష్టిస్తున్న దళపతి విజయ్ మరో సంచలన పథకానికి శ్రీకారం చుట్టారు.

ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా తయ్‌మామన్ బంగారు ఉంగరం పథకం అమలులోకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జూన్ 22 తర్వాత పుట్టిన ప్రతి బిడ్డకు గ్రాము బరువు ఉన్న 22 క్యారెట్ల బంగారు ఉంగరాన్ని ప్రదానం చేయనున్నారు. తమిళనాడు సాంప్రదాయం ప్రకారం మేనమామ (తాయ్‌మామన్) పుట్టిన బిడ్డకు కానుకలు ఇచ్చే ఆచారాన్ని గుర్తుచేస్తూ ఈ పేరు పెట్టారు.

ముఖ్యమంత్రి విజయ్ పక్కావ్యూహం ప్రకారం ఈ పథకాన్ని తీసుకువచ్చారని అంటున్నారు. ప్రజలతో ఒక భావోద్వేగ సంబంధం ఏర్పాటు చేసుకోడానికి తనను తాను మేనమామగా పిలుపించుకునేందుకు ఈ పథకం ప్రవేశపెట్టారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తమిళనాడులో అమ్మగా జయలలిత, అన్నగా ఎంజీఆర్ చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని చెబుతున్నారు. ఇప్పుడు మేనమామగా తాను కూడా ఆ స్థాయిలో పేరు తెచ్చుకోవాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి దళపతి విజయ్ పావులు కదుపుతున్నట్లు ఉన్నారని అంటున్నారు. ఇక ఏటా సుమారు 4.4 లక్షల మంది చిన్నారులు జన్మిస్తుంటే, ఈ ఏడాది బంగారు ఉంగరాల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.756 కోట్లు కేటాయించిందని చెబుతున్నారు.కాగా, ఈ పథకంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మార్కెట్ లో తరచూ ఒడిదుడుకులు లోనయ్యే బంగారం ధరల ప్రభావం పథకంపై ఉండకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుందని అంటున్నారు. ఏడాది కోసం ఇప్పటికే బంగారం సేకరించిందని, ఈ విషయమై టెండర్లు ఆహ్వానించి దాదాపు 4 లక్షలకు పైగా ఉంగరాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఆర్డర్ ఇచ్చినందున ధరల ప్రభావం ప్రభుత్వంపైన పథకంపైన ఉండదని అంటున్నారు.ఇక మేనమామ కానుకగా 22 క్యారెట్ల బంగారు ఉంగరం అందుకుంటున్న తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనిద్వారా ఒక్కో కుటుంబానికి సుమారు పది వేల వరకు లబ్ది చేకూరుతుందని అంటున్నారు. ప్రభుత్వం నుంచి విలువైన కానుక ఇస్తున్నందున ఎటువంటి అవకతకవలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుందని అంటున్నారు. ప్రతి ఉంగరానికి సురక్షితమైన ప్యాకింగ్ చేయడంతోపాటు ప్రత్యేక సీరియల్ నంబరు కేటాయించారని చెబుతున్నారు. ఎక్కడైనా పొరపాటు జరిగినా, సీరియల్ నంబరు ఆధారంగా గుర్తించే వీలు ఉంటుందని చెబుతున్నారు.

# స్పీకర్‌గారూ తేల్చేయండి: హైకోర్టు ఆదేశం



తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా రెండు వారాల కిందట జరిగిన ఘటనలపై విచారణ చేయాలని.. బాధిత ఎమ్మెల్యేల వాదన వినిపించుకుని తగు న్యాయం చేయాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ను హైకోర్టు కోరింది. ఈ విషయంలో తగు న్యాయం జరగలేదని.. తగు చట్టపరమైన సంతృప్తి తమకు లభించలేదని భావిస్తే.. తిరిగి కోర్టును ఆశ్రయించవచ్చని.. మహిళా ఎమ్మెల్యేలకు హైకోర్టు స్పష్టం చేసింది. ఈ లోగా విషయాన్ని స్పీకర్ పరిశీలించి.. పరిష్కరించాలని పేర్కొంది.

**ఏం జరిగింది?**

వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ నలుపురంగు టీ షర్టులు ధరించి.. నిరసనగా అసెంబ్లీకి వచ్చారు. ఈ సమయంలో అసెంబ్లీ గేటు వద్ద.. వివాదం రేగింది. ఈ క్రమంలో మహిళా ఎమ్మెల్యేలు.. సునీలా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటివారితో పోలీసులు ఘర్షణలకు దిగారని బీఆర్ ఎస్ ఆరోపించింది. ఇక, తన దుస్తులు కూడా చించేశారని లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై బీఆర్ ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. తాజాగా వీరి పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

**ఎమ్మెల్యేలపై దూకుడా!**

పోలీసులు హద్దులు మీరుతున్నారని హైకోర్టు వ్యాఖ్యానించింది. మహిళా ఎమ్మెల్యేలపైనే దాడులు చేస్తారా? అని నిలదీసింది. వీరిని తక్షణమే గుర్తించాలని.. దాడులకు

తెగబడిన పురుష, మహిళా పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని హైకోర్టు ఆదేశించింది. సదరు నివేదికను స్పీకర్ ప్రసాదకుమార్‌కు అందించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా పోలీసుల తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మహిళా ఎమ్మెల్యేలే పోలీసులపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. అయితే.. హైకోర్టు ఈ వాదనను తోసిపుచ్చింది. ఇంకా అలాంటి పరిస్థితి రాలేదని పేర్కొంది. ఆధారాలు కూడా కనిపించడం లేదని తెలిపింది.

**లోపలా? బయటా?**

ఇక, అసెంబ్లీ వివాదంపై హైకోర్టు మరో కీలక వ్యాఖ్య చేసింది. అసెంబ్లీ గేటు నుంచి బయట ఏం జరిగినా.. దానిపై తాము విచారణ చేస్తామని పేర్కొంది. అదేసమయంలో గేటు లోపల ఏం జరిగినా.. స్పీకర్ బాధ్యుడు కాబట్టి.. ఆయన విచారిస్తారని తెలిపింది. ఒకవేళ స్పీకర్ సంతృప్తికర నిర్ణయం తీసుకున్నట్టు కనిపించకపోయినా.. న్యాయం జరగకపోయినా.. హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్లను సూచించింది.

ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ (ఐఆర్ఐ), అమెరికా మధ్య ఇటీవల మళ్లీ మొదలైన అస్తవ్యస్తమైన చర్చలను 'ఇదివరకే చూసిన సినిమా' అని కొట్టిపారేయాలనిపించవచ్చు. జూన్ 17న కుదిరిన ఒప్పంద పత్రం కొన్ని వారాల్లోనే విచ్ఛిన్నమై, ఇరుపక్షాలూ మళ్లీ కయ్యానికి కాలుదువ్వాయి. కానీ, ఈసారి తేడా ఏమిటంటే, సమయం తమవైపు లేదని ఇరుపక్షాలూ గ్రహించాయి. ఏడు నెలలుగా సాగుతున్న యుద్ధం.. తమ తమ దేశీయ పరిస్థితుల రీత్యా రెండు దేశాలకూ ఖరీదైనదిగా మారింది. సెప్టెంబర్ 26న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రతిపాదించిన ఏడు రోజుల కాల్పుల విరమణ, హర్మూజ్ జలసంధి దశలవారీ పునఃప్రారంభ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించారు. ఇరాన్ చొరవ.. ఆర్థిక నిస్సహాయతను బయటపెట్టినా, ట్రంప్ యుద్ధాన్ని "ఇష్టపూర్వక యుద్ధం"గా భావించే సందేహవాదులకు తమ సహేతుకతను చాటుకునే అవకాశంగానూ ఇది మారింది. నవంబర్ 3న జరగనున్న మధ్యంతర కాంగ్రెస్ ఎన్నికలు ట్రంప్‌ను బలహీనపర్చగల అవకాశముంది. ఇరాన్ సైతం తమ దూకుడు వైఖరిని సమర్థించుకోవడానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. దీర్ఘకాలంలో చూస్తే, తన అతిశయోక్తి వాగ్దానాలకు తగ్గట్టుగా వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ట్రంప్‌కు ఉండగా, తమ యువతను నిమగ్నం చేసుకుని, పెరుగుతున్న అవిశ్వాసం నుంచి ప్రాంతీయ ఎదురుదెబ్బలను నివారించాల్సిన అవసరం ఇరానీ మతాధిపతులకు ఉంది. కాబట్టి, తుది విజయం గురించి బీరాలు పలుకుతూనే, ఇరుపక్షాలూ తమ గరిష్ఠవాద మొండితనం నుంచి వైదొలిగి, తాత్కాలిక శాంతిని కోరుకోవాల్సిన పరిస్థితి ఇప్పుడు!

గణాంకాల ప్రకారం, ఇరాన్‌తో పోలిస్తే అమెరికాది పరిమాణాత్మక ఆధిక్యత. మూడింతల జనాభా, 85 రెట్లు అధిక జీడీపీ, 20 రెట్లు ఎక్కువ సైనిక బడ్జెట్ దానికి ఉన్నాయి. ఆయుధాల నాణ్యత, ఆధునికతలోనూ ఇరాన్ వెనుకబడి ఉన్నప్పటికీ, దాని అసమాన వ్యూహం ఆ అంతరాన్ని కొంతమేర తగ్గించింది. అమెరికా ఇప్పటికే గరిష్ఠ ఆంక్షలు విధించిన ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' అనే మరో ఆయుధాన్ని ప్రయోగించింది. అయినప్పటికీ, ఐఆర్ఐ "లొంగిపోలేదు", అమెరికాయే ద్రవ్యోల్బణం, మందుగుండు కొరత, ఏకాకిత్వాన్ని ఎదుర్కొంటోంది. యుద్ధ అసమానత పక్కనపెడితే, ఇరు దేశాల యుద్ధ చరిత్రలూ ఇక్కడ ప్రాధాన్యత సంతరించుకుంటాయి. దాదాపు 250 ఏళ్ల క్రితం స్వాతంత్ర్య యుద్ధం తర్వాత, బలహీనపక్షంగా అమెరికా పోరాడిన చివరి యుద్ధం ఇదే కావచ్చు, ఇప్పుడు అహంకారం దాన్ని వెంటాడుతోంది. దీనికి విరుద్ధంగా, గ్రీకులు, బైజాంటైన్‌లు, అరబ్బులు, ఒట్టోమన్‌లకు ఇరానీలు తరచూ బలహీన పక్షంగానే నిలిచారు. ఇటీవలి కాలంలో చమురు కోసం బ్రిటిష్, అమెరికన్ల తారుమారు, 1980లో నవజాత ఐఆర్ఐపై ఇరాక్ దండయాత్ర.. ఇవి ఇప్పటికీ ఇరానీ రాజకీయ చర్చను రూపొందిస్తున్నాయి. సున్నీ ముస్లింలలో తమ షియా వర్గం మైనారిటీగా ఉండటం, బాధ, అమరత్వంలో సద్గుణాలు ఉన్నాయన్న వారి భావనను బలపరుస్తుంది. అదే శత్రువులను ధైర్యంగా ఎదుర్కోవడానికి ఐఆర్ఐని దృఢంగా మార్చింది.

## కాలంతో పోరాటం!

ఇరాన్‌లో రాజకీయ వ్యవస్థ కఠినతరమైంది. అసమ్మతిని అణచివేస్తూ, అమెరికా, ఇజ్రాయెల్‌లను సైతానులుగా చిత్రీకరిస్తూ బాహ్యీకరిస్తున్నారు. అమెరికన్లను, విదేశాల్లోని మిత్రదేశాలను తన తీవ్రమైన ఇరాన్ వ్యతిరేక వాగ్ధాటి వెనుక సమీకరించడంలో ట్రంప్ పెద్దగా విజయం సాధించలేదు. ఇరానీ రాజకీయ-సైనిక స్థితిస్థాపకతను విస్మరిస్తూ తలపెట్టిన ఈ యుద్ధం ఒక వ్యూహాత్మక తప్పిదంగా మారింది. రెండు కీలక సముద్ర మార్గాల మూసివేత, పెరుగుతున్న ఇంధన ధరలు, మధ్యస్థాయి కానీ దృఢమైన ఇరాన్‌తో అమెరికాను శాశ్వత ఘర్షణలోకి నెట్టే ప్రమాదం ఏర్పడింది. ఇరానీలపై ఆర్థిక బాధను రుద్దే ట్రంప్ వ్యూహం కూడా, వారిని జాతీయ జెండా చుట్టూ మరింత ఏకం చేయడం ద్వారా విఫలం కావచ్చు. అప్పుడప్పుడూ ట్యాంకర్లపై దాడులు, యెమన్-సౌదీ ఘర్షణ ఉన్నప్పటికీ, ఏడు నెలల తర్వాత ఇరు పక్షాలూ ప్రస్తుతం తమ గాయాలను నయం చేసుకుంటున్నాయి.

ఇరాన్-అమెరికా చిక్కుముడిపై కొన్ని విద్యావంతమైన అంచనాలు వేయడానికి ముందు రెండు పెద్ద అనిశ్చితులు ఎదురవుతున్నాయి. మొదటిది, ఇరానీ ప్రతిపాదన జూన్ 17నాటి ఒప్పందం ఆధారంగా ఉన్నప్పటికీ, దాని ఖచ్చితమైన అంశాలు ఇంకా అస్పష్టమే. రెండోది, జూన్ 17 తర్వాత జరిగిన పరస్పర దాడులు, అమెరికా దిగ్బంధనం, తీవ్రమైన వాగ్ధాటి -ఇవన్నీ పరస్పర అవిశ్వాసాన్ని లోతుగా చేశాయి, శాంతి ఒప్పందానికి సర్దుబాటు ప్రమాణాన్ని పెంచాయి. అయితే, స్తబ్దత కొనసాగితే శత్రు కాంగ్రెస్ ట్రంప్‌ను అడ్డుకోవడం, స్థాపన-వ్యతిరేక ప్రదర్శనలు మతాధిపతుల పునాదిని కదిలించడం అనే ఉమ్మడి వినాశనానికి దారితీస్తుందన్న అవగాహన ఈ ప్రతికూలతలను సమతుల్యం చేస్తోంది. సానుకూల దృశ్యంలో, ఇరుపక్షాలూ కొంత ఊపిరి పీల్చుకుని, మరింత పరస్పర సానుభూతిని పెంపొందించుకోవచ్చు. న్యూయార్క్‌లో ఇరానీ నేతలు తమ బసను పొడిగించడం, హర్మూజ్ జలసంధి నియంత్రణపై టెహ్రాన్ వశ్యత చూపడం, ఖతార్ మధ్యవర్తిత్వాన్ని వినియోగించుకోవడం వంటివి కొంత సానుకూల సంకేతాలు. ఈ ఒప్పందం ప్రభావవంతంగా ఉండాలంటే, కనీసం నవంబర్ 3 ఎన్నికల తేదీ వరకూ అది నిలబడాలి. ఈ తాత్కాలిక ఒప్పందం రక్తస్రావాన్ని కొంతకాలం ఆపగలిగినా, ఎన్నికల తర్వాత దాని దీర్ఘకాలిక కొనసాగింపుకు ఎలాంటి హామీ ఉంది? అణు, క్షిపణి కార్యక్రమాలు, ప్రాక్సీ నటులువంటి వివాదాస్పద అంశాలు శాశ్వత సాధారణీకరణ దిశగా పురోగతిని అడ్డుకోవచ్చు. నవంబర్ మధ్యలోగా ఒక నిర్ణాయక పరిస్థితి ఏర్పడే అవకాశముంది. గత రెండేళ్లుగా ఇజ్రాయెల్, ఇరాన్‌లు రెండు ప్రత్యక్ష యుద్ధాల్లో తలపడ్డాయి. ఇరాన్ తమకు ఉనికికే ముప్పు అన్నది ఇజ్రాయెల్ ప్రజాభిప్రాయం. వారి రెండు-సహస్రాబ్దాల నాగరిక వైరానికి కొత్త పదును తెస్తూ, ఈ ప్రాంతీయ పోటీ ఏ శాంతి ఒప్పందం కంటే ఎక్కువ కాలం కొనసాగవచ్చు. అరేబియా ద్వీపకల్పంలోని ఇతర దేశాలు, ఇరాక్, జోర్డాన్ కూడా ఈ కాల్పుల మధ్య చిక్కుకుని గణనీయమైన నష్టాన్ని చవిచూశాయి. వారి హైడ్రోకార్బన్ ఎగుమతులు, ఆర్థిక కార్యకలాపాలు కుంటుపడ్డాయి. అమెరికాపై వారి దీర్ఘకాల భద్రతా ఆధారపడటాన్ని పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఈ యుద్ధంలో.. "కాలం" అనేది చమురుకంటే మరింత జారుడుగా, అస్పష్టంగా మారిన అంశంగా నిలిచింది!

### పనికొచ్చే పలుకు



## ఎవ్వరినీ.. ఎగతాళి చేయొద్దు!

కాలేజీలో ఒక సాధారణ కుర్రాడు ఉండేవాడు. బోసిగా ఉండే బ్యాగ్, పాత సైకిల్, ఎప్పుడూ లేట్‌గా వచ్చే బస్సు కోసం ఎదురుచూపులు. క్లాస్‌మేట్స్ కొందరు అతన్ని చూసి నవ్వుకునేవారు. "వీడేం లైఫ్‌లో సెటిలవుతాడు" అని కామెంట్లు వేసేవారు. పదేళ్ల తర్వాత అదే కుర్రాడు ఒక స్టార్టప్ ఫౌండర్‌గా, కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీకి సీఈఓగా మారితే? ఇది సినిమా కథ కాదు, చాలామంది జీవితాల్లో నిజంగా జరిగే పరిణామం. ఇలాంటి కథలు మనకు ఎప్పటికప్పుడు గుర్తుచేసేది ఒక్కటే -జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు, అది ఒక చక్రంలా తిరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు మనం జీవిస్తున్న ఈ సోషల్ మీడియా యుగంలో, ఎగతాళి చేయడం ఒక 'ట్రెండ్'లా మారిపోయింది. ఎవరైనా తడబడితే స్క్రీన్‌షాట్ తీసి పోస్ట్ చేయడం, ఎవరి బట్టలు, ఎవరి యాక్సెంట్, ఎవరి ఆర్థిక పరిస్థితి చూసి కామెంట్ చేయడం -ఇదంతా ఒక్క క్లిక్‌తో జరిగిపోతోంది. కానీ ఇక్కడ మనం మర్చిపోతున్న విషయం ఏమిటంటే, స్క్రీన్ అవతల ఉన్నది కూడా మనలాంటి మనిషే, అతనికీ ఒక కథ ఉంటుంది, ఒక పోరాటం ఉంటుంది. మీరు ఎప్పుడూ ఎదుర్కోని ఇబ్బందికర పరిస్థితిని ఎవరో ఇప్పుడు ఎదుర్కొంటుంటే, వారిని చూసి నవ్వడం కంటే, వారి స్థానంలో మిమ్మల్ని మీరు ఊహించుకోవడం మంచిది. ఎందుకంటే, జీవితం ఎప్పుడు ఎవరిని ఎక్కడ ఉంచుతుందో ఎవరికీ తెలియదు.

ఎందుకిలా జరుగుతుంది?

మనం ఇతరులను ఎగతాళి చేసినప్పుడు, నిజానికి మనం చేస్తున్నది ఒక తాత్కాలిక స్నాప్‌షాట్‌ను చూసి తీర్పు ఇవ్వడమే. ఆ వ్యక్తి జీవితంలో ఏ దశలో ఉన్నాడో, ఏం ఎదుర్కొంటున్నాడో మనకు పూర్తిగా తెలియదు. ఒక వ్యక్తి ఈరోజు ఇంటర్వ్యూలో తడబడితే, రేపు అదే వ్యక్తి ఆ కంపెనీకి బాస్ కావొచ్చు. ఈరోజు ఆటోడ్రైవర్‌గా కనిపించేవాడు, రేపు సొంత క్యాబ్ కంపెనీ పెట్టొచ్చు. ఈరోజు మనం చిన్నచూపు చూసినవారే, రేపు మనం సాయం అడగాల్సిన స్థానంలో ఉండొచ్చు. దీన్నే "కర్మ" అని కొందరు అంటారు, "టైమ్ చేంజెస్" అని మరికొందరు అంటారు, కానీ అర్థం ఒక్కటే. జీవితం ఒక ఫెర్రిస్ వీల్ లాంటిది. పైకి వెళ్లేవాళ్లు కిందికి రావచ్చు, కింద ఉన్నవాళ్లు పైకి వెళ్లొచ్చు. ఈ చక్రం తిరుగుతూనే ఉంటుంది.

వినయమే నిజమైన స్టైల్

ఈ తరంలో "కాన్ఫిడెన్స్" అనే మాటను చాలామంది "అహంకారం" అనుకుని పొరబడుతున్నారు. నిజమైన కాన్ఫిడెన్స్ ఉన్నవాడు ఎవర్నీ తక్కువ చేసి మాట్లాడడు. తనకంటే తక్కువ స్థితిలో ఉన్నవారిని గౌరవంగా చూడటం, వారిని ఎగతాళి చేయకుండా ఉండటం -ఇదే అసలైన మెచ్యూరిటీ. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోయర్స్ సంఖ్య, బ్రాండెడ్ బట్టలు, ఖరీదైన ఫోన్లు -ఇవేమీ ఒక వ్యక్తి విలువను నిర్ణయించవు. నిజమైన విలువ ఉన్నదెక్కడంటే, కష్టాల్లో ఉన్నవారిని చూసినప్పుడు మీరు ఎలా స్పందిస్తారన్నదానిలోనే. ఎవరైనా తడబడితే వారిని లేపి నిలబెట్టడం, అవమానించకుండా ఉండటం -ఇదే నిజమైన లీడర్‌షిప్ క్వాలిటీ, ఇదే భవిష్యత్తులో మీకు మంచి స్నేహితులను, మంచి బంధాలను తీసుకొస్తుంది.

లైఫ్‌స్టయిల్‌ను ఎలా మారుస్తుంది?

ఈ ఆలోచనా విధానాన్ని అలవర్చుకుంటే, మీ రోజువారీ ప్రవర్తనలోనే మార్పు వస్తుంది. ఇతరులతో మాట్లాడేటప్పుడు, వారి పరిస్థితులను అర్థం చేసుకుని మాట్లాడటం మొదలుపెడతారు. మీ చుట్టూ ఉన్నవారితో పోటీ పడటం కంటే, వారిని ప్రోత్సహించడం అలవాటవుతుంది. ఇది మీ మానసిక ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. వినయంతో మెలగండి, ఇతరుల కష్టాలను గౌరవించండి. ఎందుకంటే జీవితం రాత్రికి రాత్రే మారిపోతుంది -ఎవరివైపు నుంచైనా!

# పవర్ నుంచి పవర్‌ఫుల్ ఎకానమీకి..



ఒకప్పుడు విద్యుత్ రంగం అంటే థర్మల్ పవర్ ప్లాంట్లు, హైడల్ ప్రాజెక్టులు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, సబ్‌స్టేషన్లు మాత్రమే. విద్యుదుత్పత్తి ఎంత, డిమాండ్ ఎంత, లోటు ఎంత, అదనపు విద్యుత్‌ను ఎక్కడినుంచి కొనాలి -ఇవే ప్రధాన ప్రశ్నలుగా ఉండేవి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నిర్వచనాన్నే మారుస్తున్నట్టు కనిపిస్తోంది. సూర్యుడినుంచి విద్యుత్, గాలిలోని శక్తిని విద్యుత్‌గా మార్చడం, రెండింటినీ కలిపిన హైబ్రిడ్ ప్రాజెక్టులు, అవసరమైనప్పుడు విద్యుత్‌ను విడుదల చేసే పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, భవిష్యత్ పరిశ్రమలకు ఇంధనంగా మారనున్న గ్రీన్ హైడ్రోజన్.. ఈ మొత్తం వ్యవస్థను ఒకే ఎనర్జీ ఎకానమీగా మలిచే కొత్త దిశలోకి అడుగు పెడుతోంది. తాజాగా రాష్ట్ర కేబినెట్ రూ.5,176.56 కోట్ల విలువైన ఇంధన రంగ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటిలో శ్రీ సత్యసాయి జిల్లాలో 675 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుతోపాటు వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల్లో సోలార్-విండ్ హైబ్రిడ్ ప్రాజెక్టులున్నాయి. అయితే ఈ నిర్ణయాన్ని కేవలం మరికొన్ని సోలార్ ప్రాజెక్టులకు అనుమతిచ్చిన చర్యగా చూడటంకంటే, రాష్ట్ర ఎనర్జీ మ్యాప్‌లో చోటుచేసుకుంటున్న విస్తృత మార్పులో బలమైన అడుగుగా చూడాలి. ఏపీకి పునరుత్పాదక విద్యుత్ రంగం కొత్తేమీ కాదు. రాయలసీమ ప్రాంతాలు సౌర, పవన విద్యుత్‌కు అనుకూలంగా ఉన్నాయి. కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, సత్యసాయి జిల్లాలు ఇప్పటికే రెన్యూవబుల్ ఎనర్జీ పెట్టుబడులకు కేంద్రాలుగా మారుతున్నాయి. మరోవైపు తీర ప్రాంత జిల్లాలు భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, పోర్టు ఆధారిత క్లీన్ ఎనర్జీ పరిశ్రమలకు అవకాశాలు కల్పించగలిగేవిగా రూపుదిద్దుకుంటున్నాయి. 2024లో తీసుకొచ్చిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా సోలార్, విండ్, హైబ్రిడ్, చిన్న జలవిద్యుత్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయల్స్, ఈవీ చార్జింగ్‌వంటి రంగాలను ఒకే క్లీన్ ఎనర్జీ ఫ్రేమ్‌వర్క్‌లోకి ప్రభుత్వం తీసుకొచ్చింది. దీర్ఘకాలికంగా సుమారు 160 గిగావాట్ల అదనపు రెన్యూవబుల్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసే లక్ష్యాన్ని కూడా ఈ పాలసీ నిర్దేశించింది.

రెన్యూవబుల్ ఎనర్జీ పెరగడం ఒక విషయమైతే, రోజులో ప్రతి గంటా నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉండటం మరో విషయం. సూర్యుడు ఉన్నప్పుడు సోలార్ విద్యుత్ ఎక్కువగా వస్తుంది, గాలి వేగం ఉన్నప్పుడు విండ్ పవర్ ఉత్పత్తి పెరుగుతుంది. కానీ విద్యుత్ అవసరం మాత్రం నిరంతరం ఉంటుంది. ఈ అంతరాన్ని పూడ్చకపోతే పెద్ద పరిశ్రమలు, డేటా సెంటర్లు పూర్తిగా రెన్యూవబుల్ ఎనర్జీపై ఆధారపడటం కష్టం. ఇక్కడే ఎనర్జీ స్టోరేజ్ ప్రాధాన్యం పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం 24/7 నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రూపొందించిన రోడ్‌మ్యాప్‌లో 1,600 మెగావాట్ల కొత్త థర్మల్ పవర్‌తోపాటు 2,000 మెగావాట్లకు పైగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులను విస్తరించడంపై దృష్టి పెట్టింది. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను సులభంగా చెప్పాలంటే, భారీస్థాయి 'వాటర్ బ్యాటరీ'గా చూడొచ్చు. విద్యుత్ ఎక్కువగా ఉన్నప్పుడు నీటిని దిగువ జలాశయం నుంచి ఎగువకు పంపి, అవసరమైనప్పుడు కిందకు వదిలి టర్బైన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేస్తారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సుమారు 33 గిగావాట్ల పీఎస్పీ సామర్థ్యాన్ని వినియోగించుకోవడం ఏపీ పంప్డ్ స్టోరేజ్ పాలసీ లక్ష్యం. కర్నూలు ప్రాంతంలో పిన్నాపురం వద్ద 'గ్రీన్‌కో' అభివృద్ధి చేస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టులో 4,000 మెగావాట్ల సోలార్, 1,000 మెగావాట్ల విండ్, 1,680 మెగావాట్ల పంప్డ్ హైడ్రో పవర్ ఉన్నాయి. రోజుకు ఒక సైకిల్‌లో 10,080 మెగావాట్ అవర్ స్టోరేజ్ సామర్థ్యంతో, గ్రీన్ స్టీల్, గ్రీన్ అల్యూమినియం, గ్రీన్ హైడ్రోజన్ వంటి పరిశ్రమలకు క్లీన్ పవర్ అందించడమే దీని లక్ష్యం. జూలైలో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ కర్నూలు-అనంతపురం ప్రాంతంలో 800 మెగావాట్ల సోలార్-విండ్ హైబ్రిడ్ ప్రాజెక్టుకు గ్రౌండ్‌బ్రేకింగ్ చేసింది. అయితే ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గ్రిడ్‌కు తరలించే ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ లేకపోతే పెట్టుబడుల ప్రయోజనం పూర్తిగా అందదు. కాబట్టి జెనరేషన్, స్టోరేజ్, ట్రాన్స్‌మిషన్ అనే మూడు లేయర్లూ కలిసి పనిచేయాల్సి ఉంటుంది.

విశాఖపట్నానికి వస్తున్న డేటా సెంటర్ పెట్టుబడులు ఎనర్జీ రంగానికి కొత్త డిమాండ్‌ను సృష్టించే అవకాశం ఉంది. డేటా సెంటర్లు 24 గంటలూ విద్యుత్ అవసరమయ్యే మౌలిక సదుపాయాలు. ఏపీలో డేటా సెంటర్లు వినియోగించే విద్యుత్‌లో కనీసం 70 శాతం పునరుత్పాదక వనరులనుంచే రావాలనే నిబంధనను రాష్ట్రం అమలు చేయాలని నిర్ణయించినట్టు ఐటీ మంత్రి లోకేష్ వెల్లడించారు. ఇదే నేపథ్యంలో గుజరాత్‌లో టోరెంట్ గ్రూప్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ జరిపిన సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. సోలార్, విండ్, హైబ్రిడ్‌తోపాటు పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో ఏపీలో పెట్టుబడులను పరిశీలించాలని ఆహ్వానించగా, 2030 నాటికి 10 గిగావాట్ల రెన్యూవబుల్ సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్న టోరెంట్ గ్రూప్, ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చింది. కొత్త ఎనర్జీ మ్యాప్‌లో ప్రతి ప్రాంతానికీ ఒక ప్రత్యేక పాత్ర ఏర్పడే అవకాశం ఉంది. కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాలు సోలార్-విండ్-స్టోరేజ్ ప్రాజెక్టులకు కేంద్రంగా, ప్రకాశం జిల్లా రెన్యూవబుల్ పరికరాల తయారీకి, విశాఖపట్నం డేటా సెంటర్లు, డిజిటల్ మౌలిక సదుపాయాలకు, కాకినాడ, కృష్ణపట్నం, రామాయపట్నం వంటి తీర ప్రాంతాలు గ్రీన్ అమోనియా, గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతులకు కేంద్రాలుగా ఎదిగే అవకాశం కనిపిస్తోంది. దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ఎక్కువ విలువ రావాలంటే సోలార్ మాడ్యూల్స్, ఇన్వర్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, బ్యాటరీ ప్యాక్స్, ఎలక్ట్రోలైజర్ల వంటి పరికరాల తయారీ కూడా పెరగాలని ఐసీఈపీ నిర్దేశిస్తోంది. దీంతో ఎనర్జీ రంగంలో ఉద్యోగాల స్వభావం కూడా మారనుంది. సైట్ ఇంజినీరింగ్, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, గ్రిడ్ మేనేజ్‌మెంట్, బ్యాటరీ మేనేజ్‌మెంట్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఆపరేషన్స్ వంటి కొత్త ఉద్యోగ విభాగాలు ఏర్పడే అవకాశముంది.

క్లీన్ ఎనర్జీ చర్చ పరిశ్రమల దగ్గరే ఆగిపోకుండా, వ్యవసాయ ఫీడర్ల సోలరైజేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకూ, రూఫ్‌టాప్ సోలార్ ద్వారా వికేంద్రీకృత విద్యుత్ వ్యవస్థకూ విస్తరిస్తోంది. కేంద్ర గణాంకాల ప్రకారం 2026 ఆగస్టు నాటికి దేశంలో మొత్తం రెన్యూవబుల్ ఎనర్జీ సామర్థ్యం 295.55 గిగావాట్లకు చేరగా, రాష్ట్రాల మధ్య పెట్టుబడుల పోటీ కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, విద్యుత్‌ను ఉత్పత్తి చేసి బయటకు అమ్మడం కంటే, అదే విద్యుత్‌తో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా తయారు చేసి ఎగుమతి చేయడం ద్వారా విలువ గొలుసును విస్తరించాలన్నది కూటమి ప్రభుత్వ ప్రణాళిక. రేపటి పారిశ్రామిక పోటీకి అసలు కొలమానం ఎవరి దగ్గర ఎక్కువ విద్యుత్ ఉంది అన్నది కాదు, ఎవరు చౌకగా, నమ్మకంగా, నిరంతరంగా శుభ్రమైన విద్యుత్‌ను అందించి, దానితో ఎక్కువ విలువను సృష్టించగలరు అన్నదే! సోలార్ నుంచి స్టోరేజ్ వరకు, స్టోరేజ్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకు, అక్కడి నుంచి పరిశ్రమలు, డేటా సెంటర్లు, ఎగుమతుల వరకు సాగుతున్న ఈ ప్రయాణమే, ఏపీ కొత్త ఎనర్జీ మ్యాప్‌లో రూపుదిద్దుకుంటున్న అధునాతన దృశ్యం!! ■



మిమ్మల్ని పట్టించుకోని వారి కోసం శక్తిని, సమయాన్ని వృథా చేయకండి. ఆ బంధం నుంచి బయటపడేందుకు దాన్ని వాడండి. ఎందుకంటే ఎవరి ముందైనా ప్రేమ కోసం ప్రాధేయపడటం అంటే మనశ్శాంతిని కోల్పోయి, ఫలితం లేని ప్రయత్నంలో మనల్ని మనమే బాధించుకోవడం. అందుకే ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ దూరంగా జరగడం ఓటమి కాదు.. మనపై మనకున్న గౌరవానికి నిదర్శనం. మన విలువను గుర్తించని చోట ఉండిపోవడం కంటే.. మనసుకు ప్రశాంతతనిచ్చే దారిని ఎంచుకోవడమే మంచిది. కొన్ని బంధాలను వదులుకోవడం బాధ కలిగించినా.. అదే కొత్త ప్రశాంతతకు తలుపులు తెరుస్తుంది.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## ఎక్స్‌రేలో ఫేక్ ఐడీల గుట్టురట్టు!



గేమింగ్ కన్సోల్ తీసుకెళ్తున్నానని అనుకున్నాడేమో, కానీ న్యూయార్క్‌లోని లాగార్డియా విమానాశ్రయంలో అతని బ్యాగ్ ఎక్స్‌రేలో అలారం మోగింది! కారణం ఎక్స్‌బాక్స్ గేమింగ్ సిస్టమే అయినా, దాని పక్కనే ఒక ప్లాస్టిక్ బ్యాగ్‌లో అనేక నకిలీ డ్రైవింగ్ లైసెన్సులు దొరికాయి. విచిత్రం ఏమిటంటే, ఆ లైసెన్సుల్లో పుట్టిన తేదీలు, కేటగిరీలు వేర్వేరుగా ఉన్నా, అన్నింటిలో ఫోటో మాత్రం ఒక్కటే! టీఎస్ఏ అధికారి క్రిస్టఫర్ రామోస్ నిశితంగా గమనించి ఈ మోసాన్ని పట్టుకోగా, పోర్ట్ అథారిటీ పోలీసులు అతన్ని విమానం ఎక్కడానికి క్షణాల ముందు అరెస్ట్ చేశారు. ఒకే మొహంతో బహుళ గుర్తింపులు సృష్టించాలని చూశాడుగానీ, చివరికి ఎక్స్‌రే అతని ఆట కట్టించింది!



# గుండెకు టీకా రక్షణ

**అసలే గుండెజబ్బు, ఆపై ఇన్‌ఫెక్షన్. రెండూ కలిస్తే అగ్నికి ఆజ్యం తోడైనట్టే. అసలే అంతంత మాత్రంగా పనిచేస్తున్న గుండె మీద ఫ్లూ, న్యుమోనియా, కొవిడ్ వంటి ఇన్‌ఫెక్షన్లు ఇంకా పెద్ద భారమే మోపుతాయి. అప్పటికే ఉన్న గుండె వైఫల్యం, పూడికల వంటి సమస్యలు మరింత ఉద్ధృతమవుతాయి కూడా. అందుకే అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ (ఏసీసీ) గుండె సంరక్షణలో భాగంగా టీకా మార్గదర్శకాలను సవరించింది. తాజా అధ్యయన ఫలితాలను బేరీజు వేసి రూపొందించిన ఇవి మనకూ అవసరమే. మనదేశ పరిస్థితులకు అనుగుణంగా ఆచరించటమూ ముఖ్యమే.**

ఇన్‌ఫెక్షన్లు సోకినప్పుడు వాటిని ఎదుర్కోవటానికి శరీరం మరింత శ్రమించాల్సి వస్తుంది. రోగనిరోధక వ్యవస్థ ఉన్నట్టుండి రంగంలోకి దిగి, జబ్బులతో పోరాడటం మొదలెడుతుంది. తెల్లరక్తకణాలు, యాంటీబాడీల వంటి సైన్యాన్ని రంగంలోకి దింపుతుంది. ఈ క్రమంలో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) తలెత్తుతుంది. జీవక్రియలు వేగం పుంజుకుంటాయి. శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇవన్నీ గుండె మీద అదనపు భారం మోపేవే. మామూలుగా ఆరోగ్యంగా ఉన్నవారికే ఇది ఇబ్బందులు కలిగిస్తుంది. ఇక గుండె జబ్బులుంటే చెప్పేదేముంది? జ్వరం, ఒంట్లో నీటి శాతం తగ్గటం మూలంగా గుండె మామూలు కన్నా ఎక్కువ వేగంగా కొట్టుకోవటం ప్రారంభిస్తుంది. శ్వాస సరిగా తీసుకోకపోవటం వల్ల రక్తంలో ఆక్సిజన్ తగ్గటంతో శరీరానికి అవసరమైనంత రక్తాన్ని పంప్ చేయటానికి ఇంకాస్త బలంగా పనిచేస్తుంటుంది. అప్పటికే గుండె వైఫల్యం గలవారికి, గుండె బలహీనంగా ఉన్నవారికిది మరిన్ని చిక్కులు కలిగిస్తుంది. మరోవైపు శరీరమంతా విస్తరించే వాపు ప్రక్రియ మూలంగా రక్తనాళాల్లోని పూడికలు స్థిరత్వం కోల్పోయి, చిట్లిపోవచ్చు. దీంతో రక్తం గడ్డకట్టే ప్రమాదముంది. అప్పుడు గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళం ఉన్నట్టుండి మూసుకుపోయి, గుండెపోటు సంభవించొచ్చు. ఇన్‌ఫెక్షన్ల మూలంగా ప్లేట్‌లెట్ కణాలు ఉత్తేజితమై రక్తం చిక్కబడొచ్చు కూడా. ఇదీ రక్తనాళాలు మూసుకోవటానికి దోహదం చేసేదే. అంతేనా? వాపు కారకాలు (సైటోకైన్లు) గుండె విద్యుత్ వ్యవస్థ, అయాన్ మార్గాల మీద ప్రభావం చూపటంతో గుండె లయ తప్పే (అరిత్మియా) ప్రమాదమూ ఉంది. తీవ్ర జ్వరం, రక్తంలో ఆక్సిజన్ తగ్గటం, ఒత్తిడి హార్మోన్లు ఉద్ధృతం కావటం వంటివీ గుండె లయను అస్తవ్యస్తం చేయొచ్చు. ఇవి చాలవన్నట్టు కొన్ని వ్యాధి కారకాలు నేరుగా గుండె కండరం మీదే దాడి చేయొచ్చు. దీంతో గుండె కండరం బలహీనం కావటం, కవాటాలు దెబ్బతినటం వంటి సమస్యలూ ముంచుకురావొచ్చు. అందువల్ల గుండెజబ్బులు గలవారు ఇన్‌ఫెక్షన్ల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండటం తప్పనిసరైంది. ఇక్కడే ఇన్‌ఫెక్షన్లను నివారించే టీకాలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. వీటిల్లో ముఖ్యమైనవి ఇవీ.

### ఇన్‌ఫెక్షన్ వచ్చినా

టీకాలు ఇన్‌ఫెక్షన్ల నివారణకు తోడ్పడే మాట నిజమే అయినా అసలు ఇన్‌ఫెక్షనే రాదనుకోవటానికి లేదు. కొందరిలో ఇన్‌ఫెక్షన్ రావచ్చు. అయినప్పటికీ అవి తీవ్రం కాకుండా, ప్రాణాపాయానికి దారి తీయకుండా టీకాలు కాపాడతాయనే సంగతి మరవరాదు. సాధారణంగా టీకాల విషయంలో జనరల్ ఫిజిషియన్లు చొరవ తీసుకుంటుంటారు. అయితే వీరితో పాటు కార్డియాలజిస్టులూ వీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, గుండెజబ్బులు గలవారు వీటిని కచ్చితంగా తీసుకునేలా చూడాలని ఏసీసీ మార్గదర్శకాలు సూచిస్తుండటం గమనార్హం.

### ఫ్లూ టీకా– ఏటా ఒకసారి

ఫ్లూ మామూలు ఇన్‌ఫెక్షనే గానీ గుండెజబ్బు బాధితుల్లో కొందరికి ప్రాణాంతకంగానూ పరిణమిస్తుంది. దీని నివారణకు ఏటా ఒక ఫ్లూ టీకా తీసుకోవాలి. గుండెజబ్బు బారినపడ్డ 19 నుంచి 64 ఏళ్ల వారు ప్రామాణిక టీకా.. 65 ఏళ్లు దాటినవారు అధిక మోతాదు ఫ్లూ టీకా తీసుకోవాలన్నది ఏసీసీ సిఫారసు. అయితే మనదగ్గర అధిక మోతాదు టీకా అందుబాటులో లేదు

కాబట్టి ప్రామాణిక టీకా తీసుకుంటే చాలు. దీన్ని తీసుకున్నవారిలో శ్వాసకోశ జబ్బుతో ఆసుపత్రిలో చేరటం తగ్గుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. తీవ్ర గుండెపోటు బారినపడ్డ తర్వాత ఫ్లూ టీకా తీసుకున్నవారిలో ఏ కారణంతోనైనా మరణించే ముప్పు 28% వరకు తగ్గుతున్నట్టు తేలింది.

ఫ్లూ కారక వైరస్‌లు నిరంతరం మారి పోతుంటాయి. అందుకే ఆయా వైరస్‌లకు అనుగుణంగా ఫ్లూ టీకాను ప్రతి సంవత్సరం సరికొత్తగా తీర్చిదిద్దుతుంటారు. ఇలాంటి తాజా టీకాను తీసుకోవాలి.

### ఆర్ఎస్‌వీ టీకా – ముఖ్యమే కానీ..

ఆర్ఎస్‌వీ (రెస్పిరేటరీ సిన్సీషియల్ వైరస్) ప్రధానంగా చిన్నపిల్లల్లో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతుంటుంది. అయితే వృద్ధుల్లో.. ముఖ్యంగా గుండెజబ్బులు గలవారిలో తీవ్ర అనారోగ్యానికి దారితీయొచ్చు. అందువల్ల 50 ఏళ్లు దాటిన గుండెజబ్బు బాధితులు ఆర్ఎస్‌వీ టీకా గురించి డాక్టర్‌తో చర్చించటం మంచిది. ఈ టీకా ఇటీవలే మనదేశంలో అందుబాటులోకి వచ్చింది. ఇంకా విరివిగా అందుబాటులో లేదు. దీన్ని జీవితంలో ఒకసారి తీసుకుంటే చాలు.

న్యుమోకోకల్ టీకా జీవితంలో ఒకసారి

న్యుమోకోకల్ ఇన్‌ఫెక్షన్లు (న్యుమోనియా, మెదడు పొరల వాపు, రక్తంలో ఇన్‌ఫెక్షన్) గుండె జబ్బులు గలవారికి మరింత ప్రమాదకరంగా పరిణమిస్తాయి. వీటి నివారణకు న్యుమోకోకల్ టీకా ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంతకుముందు న్యుమోకోకల్ కాంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ) తీసుకోని పెద్దవారిలో 50 ఏళ్ల నుంచి న్యుమోనియా టీకా కార్యక్రమం ఆరంభించాలి. దీర్ఘకాల గుండెజబ్బు, గుండె వైఫల్యం, గుండె కండరం మందం కావటం వంటి సమస్యలుంటే 19 నుంచి 49 ఏళ్ల వారికీ టీకా అవసరమే. గతంలో టీకా తీసుకోనివారు పీసీవీ20 తీసుకోవాలి. దీన్ని జీవితంలో ఒకసారి తీసుకుంటే చాలు. అయితే పీసీవీ15 టీకా తీసుకుంటే మాత్రం ఆ తర్వాత న్యుమోకాకల్ పాలీశాక్రైడ్ వ్యాక్సిన్ 23–వాలెంట్ (పీపీఎస్‌వీ23) వేయించుకోవాల్సి ఉంటుంది.

### న్యుమోకాకల్ టీకా 75% వరకూ తీవ్ర ఇన్‌ఫెక్షన్ల బారినపడకుండా కాపాడుతున్నట్టు ప్రయోగ పరీక్షల్లో తేలింది.

### హెర్పిస్ జోస్టర్ టీకా రెండు మోతాదులు

హెర్పిస్ జోస్టర్ వైరస్ ఆటలమ్మ (చికన్‌పాక్స్) రకానికి చెందినది. చిన్నప్పుడు చాలామంది దీని బారినపడే ఉంటారు. అప్పటికి తగ్గినా కొన్నిసార్లు వైరస్ నిద్రాణంగా ఉండొచ్చు. యాభై ఏళ్లు దాటాక అప్పుడప్పుడు విజృంభిస్తుంటుంది. దీంతో పొట్ట మధ్యలోంచి వీపు మధ్య వరకూ వరుసగా ఎర్రటి పొక్కులు వస్తుంటాయి. దీన్నే సర్పి, చల్ది అంటుంటారు. ఇది భరించలేనంత నొప్పితో విలవిల్లాడేలా చేస్తుంది. గుండెజబ్బు బాధితుల్లో గుండెపోటు, పక్షవాతం ముప్పులూ పెరుగుతాయి. అప్పటికే గుండెజబ్బులు గలవారికి సర్పి తలెత్తే అవకాశమూ ఎక్కువే. కాబట్టి హెర్పిస్ జోస్టర్ టీకాను రెండు మోతాదుల్లో తీసుకోవాలి. మొదటి మోతాదు తీసుకున్నాక 2 నుంచి 6 నెలల వ్యవధిలో రెండోది వేయించుకోవాలి.

ఈ టీకాతో గుండెపోటు, గుండె వైఫల్యం, గుండె లయ తప్పటం, పక్షవాతం ముప్పులు గణనీయంగా తగ్గుతున్నట్టు దక్షిణ కొరియాలో నిర్వహించిన ప్రయోగ పరీక్షల్లో వెల్లడైంది.

### టీడ్యాప్ – మనకు ప్రత్యేకం

మనదగ్గర గర్భిణులకు, పిల్లలకు ధనుర్వాతం, కంఠసర్పి, కోరింతదగ్గు రాకుండా టీడ్యాప్ టీకా వేయటం తెలిసిందే. ఇది గుండెజబ్బు గలవారికీ ముఖ్యమే. ఏసీసీ మార్గదర్శకాల్లో దీని గురించి ప్రస్తావించకపోయినా మనదగ్గర తీసుకోవటమే మంచిది. ఎందుకంటే కంఠసర్పి, కోరింతదగ్గులు తీవ్ర శ్వాసకోశ సమస్యలకు, గుండె వైఫల్యం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఒకసారి ఈ టీకా తీసుకుంటే పదేళ్ల వరకూ రక్షణ లభిస్తుంది. అంటే పదేళ్లకోసారి బూస్టర్ మోతాదు తీసుకోవాలన్నమాట.

### కొవిడ్ టీకా – నిర్లక్ష్యం తగదు

కొవిడ్ మహమ్మారి ఎంత విలయం సృష్టించిందో అందరికీ అనుభవమే. వైరస్ మూలంగా పుట్టుకొచ్చిన సైటోకైన్ల ఉప్పెనే చాలామందికి ప్రాణాంతకంగా పరిణమించింది. అప్పట్లో అంతా టీకాలు తీసుకోవటం, వైరస్‌ను ఎదుర్కొనే శక్తిని సంతరించుకోవటం వల్ల ప్రస్తుతం కొవిడ్ మామూలు జలుబుగా మారి ఉండొచ్చు. కానీ గుండెజబ్బులు గలవారికి, రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారికి తీవ్ర ముప్పే తెచ్చిపెడుతుంది. కానీ కొవిడ్ టీకా విషయంలో మనదగ్గర అంత శ్రద్ధ పెట్టటం లేదు. అమెరికా వంటి దేశాల్లో ప్రతి సంవత్సరం కొవిడ్ వైరస్ రకాలకు అనుగుణంగా టీకాలను రూపొందిస్తున్నారు. మనదేశంలో ఇలా జరగటం లేదు. ఏదేమైనా 50 ఏళ్లు పైబడిన గుండెజబ్బు బాధితులు కొవిడ్ టీకాను నిర్లక్ష్యం చేయటం తగదు. ఇంతకుముందు రెండు లేదా మూడు మోతాదులు తీసుకున్నప్పటికీ ముప్పు ఎక్కువగా ఉన్న గుండెజబ్బు బాధితులు కనీసం ఏటా ఒకసారి బూస్టర్ మోతాదు వేయించుకోవటం మంచిది. అయితే టీకా అందుబాటు, అప్పటి కొవిడ్ పరిస్థితి, ప్రభుత్వ మార్గదర్శకాలను బట్టి టీకా రకం, మోతాదుల మధ్య వ్యవధిని నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

# ‘చక్కని గుండె’ కోసం అమెరికా హార్ట్ అసోసియేషన్ సూచిస్తున్న ఆహారం

**గుండె జబ్బుల విషయంలో ఆహారం కీలక పాత్ర**

**కొన్ని రకాల ఆహారంతో రక్తపోటు, కొలెస్ట్రాల్ ముప్పు**

**నాలుగు రకాల డైట్ నమూనాలను వెల్లడించిన యూఎస్ సంస్థ**



తీసుకునే ఆహారం, జీవనశైలి గుండెపై ఎంతో ప్రభావం చూపిస్తాయి. నేడు గుండె జబ్బులు పెరిగిపోవడానికి ఆహారం విషయంలో సరైన నియమాలు పాటించకపోవడం ప్రధాన కారణం కాగా, సరైన నిద్ర లేకుండా, శారీరక వ్యాయామం లేని జీవన విధానం కూడా ప్రభావం చూపిస్తోంది. మరి ఈ క్రమంలో గుండెకు హాని చేయని ఆహారం ఏది? అన్న సందేహం ఎక్కువ మందికి వస్తుంటుంది. ఎందుకంటే ఆహారం విషయంలో ఒక్కొక్కరు ఒక్కో రకంగా చెబుతుండడంతో పెద్ద అయోమయం నెలకొంది. అందుకే అమెరికన్ హార్ట్ అసోసియేషన్ గుండె జబ్బుల రిస్క్ ను తగ్గించే పలు రకాల డైట్ వివరాలను విడుదల చేసింది.

### ఆహారం పాత్ర

గుండె జబ్బుల విషయంలో ఆహారం పాత్ర కచ్చితంగా ఉంటుంది. మనం తీసుకునే ఆహారం రక్తపోటు నియంత్రణపై ప్రభావం చూపిస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్ ను పెంచుతుంది. ఈ రెండూ గుండె జబ్బులకు కారణమయ్యే పెద్ద సమస్యలు. కనుక రక్తపోటు, కొలెస్ట్రాల్ ను పెంచని ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

### డాష్ డైట్

డాష్ అంటే.. డైటరీ అప్రోచెస్ టు స్టాప్ హైపర్ టెన్షన్. రక్తపోటును నియంత్రణలో ఉంచేందుకు రూపొందించిన ఆహార నమూనా ఇది. ఉప్పు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలను తీసుకోవాలి. పాల ఉత్పత్తులు తీసుకోవచ్చు కానీ తక్కువ ఫ్యాట్ ఉండేవి ఎంపిక చేసుకోవాలి. లీన్ ప్రొటీన్ తీసుకోవాలి.

### పెస్కాటేరియన్ డైట్

ఇది శాకాహారం. పండ్లు, కూరగాయలు, నట్స్, సీడ్స్, తృణ ధాన్యాలు, డైరీ ఉత్పత్తులను ఈ ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. మీట్, చికెన్ కు దూరంగా ఉండాలి. కావాలంటే చేపలను తీసుకోవచ్చు.

### మెడిటెర్రానియన్ డైట్

ఇది మంచి సమతులాహారం. ఆరోగ్యకరమైన ఆహారంగా దీనికి గుర్తింపు కూడా లభించింది. మొక్కల ఆధారిత ఆహారం ఇది. తృణ ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, నట్స్, మూలికలు, దినుసులు, పప్పు ధాన్యాలను ఇందులో భాగంగా తీసుకోవాలి. యుగర్ట్, చీజ్, చికెన్, గుడ్లను పరిమితంగా తీసుకోవచ్చు.

### లాక్టో ఓవో వెజిటేరియన్ డైట్

మొక్కల ఆధారిత ఆహారానికితోడు డైరీ ఉత్పత్తులు, గుడ్లను ఇందులో తీసుకోవచ్చు. గుడ్లు మినహా చికెన్, చేపలు, మీట్ ను కూడా తీసుకోకూడదు.

# డయాబెటిస్ ఉన్న వారు పుచ్చకాయ తినొచ్చా..?

**పుచ్చకాయలో గ్లైసిమిక్ ఇండెక్స్ కొంచెం ఎక్కువే**

**అయినా 92 శాతం నీరు, మిగిలినది ఫైబర్**

**విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ, కేలరీలు తక్కువ**

**మోస్తరుగా తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు**





వేసవిలో ఎక్కువ మంది ఇష్టంగా తినే పండ్లలో పుచ్చకాయ కూడా (వాటర్ మెలాన్) ఒకటి. రుచితో పాటు అధిక శాతం నీరు ఉండే పుచ్చకాయ పోషకాల నిలయం. పుచ్చకాయలో సహజ చక్కెర పరిమాణం అధికంగా ఉంటుంది. దీంతో దీన్ని డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్న వారు తినొచ్చా? అన్న సందేహం వస్తుంటుంది. దీనికి నిపుణులు పరిమితంగా తినొచ్చని సూచిస్తున్నారు. వాటర్ మెలాన్ లో కేలరీలు తక్కువగా ఉంటాయి. విటమిన్ ఏ, సీ, ఫైబర్ ఉండడం అనుకూలం. లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కూడా లభిస్తుంది. ఇది కేన్సర్, గుండె జబ్బుల నుంచి రక్షణనిచ్చే యాంటీ ఆక్సిడెంట్. పుచ్చకాయలో 92 శాతం నీరే ఉంటుంది. మిగిలినది ఫైబర్. కనుక పండ్లలో ఇదొక మంచి ఎంపిక అవుతుంది. అధిక నీటి పరిమాణం వల్ల వేసవిలో శరీరంలో తగినంత నీటి పరిమాణం ఉండేందుకు ఈ పండు అనుకూలిస్తుంది. ఇందులో ఫొలేట్, పొటాషియం, ఫైటో కెమికల్స్, మినరల్స్ కూడా ఉంటాయి.

వాటర్ మెలాన్ గ్లైసిమిక్ ఇండెక్స్ 72. ప్రతీ పదార్థానికీ గ్లైసిమిక్ ఇండెక్స్ ఉంటుంది. అంటే తిన్న తర్వాత ఎంత వేగంగా గ్లూకోజ్ గా మారిపోతుందన్నది ఈ ఇండెక్స్ చెబుతుంది. జీఐ 72 అంటే మోస్తరు నుంచి అధికం అని అర్థం. మధుమేహులు జీఐ తక్కువగా ఉన్నవి తీసుకుంటే మంచిది. మరి పుచ్చకాయలో జీఐ కొంచెం ఎక్కువగా ఉన్నందున తీసుకోవచ్చా? అన్న సందేహం తప్పకుండా వస్తుంది. కాకపోతే పుచ్చకాయలో 92 శాతం నీరు, మిగిలినది ఫైబర్ అవ్వడం వల్ల, తిన్న వెంటనే అది గ్లూకోజ్ గా మారిపోదు. ఫైబర్ ఉండడం వల్ల నిదానంగానే రక్తంలోకి విడుదల అవుతుంది. అందుకని పరిమితంగా తీసుకోవడం మధుమేహులకూ మంచిదే.

# టీ20ల్లో శ్రీ చరణి సరికొత్త రికార్డు.. మళ్లీ టాప్-5లోకి స్మృతి మంధాన!



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన మహిళల టీ20ఐ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి సంచలన రికార్డు సృష్టించింది. అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ కెరీర్‌లోనే అత్యధికంగా 817 రేటింగ్ పాయింట్లను సాధించి సరికొత్త చరిత్ర సృష్టించింది. దీంతో నవంబర్ 2018 నుంచి ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ మెగాన్ షట్ పేరు మీద ఉన్న 806 పాయింట్ల ఆల్-టైమ్ రికార్డును శ్రీ చరణి బ్రేక్ చేసేసింది. ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత్ విజయం సాధించడంలో శ్రీ చరణి కీలక పాత్ర పోషించింది. ఈ టోర్నీలో మొత్తం 12 వికెట్లు తీసిన ఆమె, శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 4/20తో అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇక ఆసియా క్రీడలలోనూ తన జోరును కొనసాగించిన చరణి.. జపాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో కేవలం 10 పరుగులే ఇచ్చి 4 వికెట్లు (4/10) పడగొట్టి కెరీర్ బెస్ట్ ఫిగర్స్ నమోదు చేసింది. అంతేకాకుండా శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక పోరులోనూ కీలకమైన 2 వికెట్లు తీసి టీమిండియాకు గోల్డ్ మెడల్ అందించడంలో ప్రధాన భూమిక పోషించింది. ఈ అద్భుతమైన ప్రదర్శనే ఆమెను ఐసీసీ చరిత్రలోనే అత్యధిక రేటింగ్ సాధించిన బౌలర్‌గా నిలబెట్టింది.

**టాప్-5లోకి దూసుకొచ్చిన స్మృతి, దీప్తి శర్మ:**

ఆసియా క్రీడల ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో 79 పరుగులు సాధించిన భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-5లోకి దూసుకొచ్చారు. అంతేకాకుండా ఆమె వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని పదిలపరుచుకున్నారు.

ఆసియా క్రీడల ఫైనల్‌లో మూడు వికెట్లు తీసిన ఆల్ రౌండర్ దీప్తి శర్మ 754 పాయింట్లతో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోగా, ఇంగ్లాండ్ ఆటగాడు సోఫీ ఎక్లెస్టన్ (723) మూడో స్థానంలో కొనసాగుతుంది.

# వర్షం దెబ్బకు నాలుగు క్వార్టర్ ఫైనల్స్ రద్దు.. సెమీస్ బెర్త్ ఫిక్స్: పాక్‌తో కాదు శ్రీలంకతోనే భారత్ ఢీ




**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 ఆసియా క్రీడలలో పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌ను వర్షం తీవ్రంగా దెబ్బతీసింది. నిరంతరం కురుస్తున్న వర్షాల కారణంగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లన్నీ రద్దు కావడంతో, టోర్నమెంట్ రూల్స్ ప్రకారం సెమీఫైనల్స్ బెర్త్‌లు ఖరారయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమిండియా.. ఫైనల్ పోరుకు అర్హత సాధించేందుకు శ్రీలంకతో తలపడనుంది.

**వర్షం దెబ్బకు అన్నీ క్వార్టర్ ఫైనల్స్ రద్దు:**

నాగోయా, నిస్షిన్ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మెన్స్ క్రికెట్ నాకౌట్ దశ మ్యాచ్‌లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాకిస్థాన్ - హాంకాంగ్, భారత్ ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య జరగాల్సిన తొలి రెండు క్వార్టర్ ఫైనల్స్ వర్షంతో పూర్తిగా రద్దయ్యాయి. ఐసీసీ టీ20ఐ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న కారణంగా భారత్, పాకిస్థాన్‌లు నేరుగా సెమీస్‌లోకి ప్రవేశించాయి. అలాగే శ్రీలంక వర్సెస్ నేపాల్, బంగ్లాదేశ్ వర్సెస్ మలేషియా మ్యాచ్‌లు కూడా వర్షార్పణం కావడంతో, ర్యాంకింగ్ ఆధారంగా శ్రీలంక, బంగ్లాదేశ్ కూడా సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.

**శ్రేయస్ కెప్టెన్సీలో బరిలోకి భారత్:**

స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు ఇంకా ఈ ఆసియా క్రీడల్లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ జట్టులో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ కూడా చోటు దక్కించుకోవడం విశేషం. ప్రధాన కోచ్ గౌతం గంభీర్ గైర్హాజరీలో నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ టోర్నీకి హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

**అక్టోబర్ 1న సెమీఫైనల్స్:**

వర్షం అంతరాయం తొలగిపోయి, వాతావరణం అనుకూలిస్తే అక్టోబర్ 1వ తేదీ (గురువారం)న రెండు హై-వోల్టేజ్ సెమీఫైనల్స్ జరగనున్నాయి.

మొదటి సెమీఫైనల్: పాకిస్థాన్ జం బంగ్లాదేశ్

రెండో సెమీఫైనల్: భారత్ జం శ్రీలంక (వేదిక: కొరోగి స్పోర్ట్స్ పార్క్, నిస్షిన్)

# ట్రాక్‌పై దుమ్మురేపిన భారత అమ్మాయిలు.. 4x400 మీటర్ల రిలేలో స్వర్ణం







**హైదరాబాద్ పెన్ పవర్:** వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడలలో (ూంఋఅ +ఋఎవం 2026) అథ్లెటిక్స్ విభాగంలో భారత్ ఎట్టకేలకు తన తొలి బంగారు పతకాన్ని సాధించింది. గత కొన్ని రోజులుగా రజత, కాంస్య పతకాలతో సరిపెట్టుకున్న టీమిండియా అథ్లెట్లు, ఈరోజు (సెప్టెంబర్ 29, మంగళవారం) జరిగిన మహిళల 4ఇ400 మీటర్ల రిలే ఫైనల్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశానికి చిరస్మరణీయ పసిడిని అందించారు.

**అదరగొట్టిన మహిళల జట్టు.. అథ్లెటిక్స్ లో స్వర్ణం:**

భారత మహిళల రిలే జట్టులో కీలక సభ్యులైన విత్య రామ్‌రాజ్, కిరణ్ పహల్, మచేత్తిర పూవమ్మ, ప్రాచి అద్భుతమైన సమన్వయంతో బరిలోకి దిగారు. హోరాహోరీగా సాగిన ఈ తుది పోరులో భారత క్వార్టెట్ కేవలం 3:29.69 సెకన్ల వ్యవధిలో గమ్యస్థానాన్ని చేరి మొదటి స్థానంలో నిలిచింది. చివరి ల్యాప్‌లో బహ్రెయిన్ (3:30.21), చైనా (3:31.02) జట్ల నుంచి తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, భారత రన్నర్లు ఏమాత్రం తడబడకుండా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. బహ్రెయిన్ రజతం, చైనా కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నాయి.

**చరిత్ర సృష్టించిన విత్య.. ఒకే గేమ్స్‌లో 3 పతకాలు:**

ఈ స్వర్ణ పతకం గెలుపుతో అథ్లెట్ విత్య రామ్‌రాజ్ తన అద్భుతమైన ఆసియా క్రీడల ప్రయాణాన్ని ముగించింది. ఈ క్రీడలలో ఆమెకు ఇది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటికే మిక్స్‌డ్ 4ఇ400 మీటర్ల రిలేలో రజతం సాధించిన విత్య.. మహిళల 400 మీటర్ల హర్డిల్స్ విభాగంలో దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష యొక్క 42 ఏళ్ల నాటి జాతీయ రికార్డును (54.75 సెకన్లు) బద్దలు కొట్టి మరీ కాంస్య పతకం గెలుచుకుంది. తాజాగా ఈ రిలే గోల్డ్‌తో ఆమె తన ఖాతాలో అరుదైన ట్రిపుల్ మెడల్స్ సాధించారు.

# దసరా బరిలో జైలర్ 2 & రణబాలి ప్రమోషనల్ స్ట్రాటజీ!







దసరా పండుగ అత్యంత ఆసక్తికరంగా మారబోతోంది. పండుగ వాతావరణంలో సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న -జైలర్ 2-, విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న జంటగా తెరకెక్కుతోన్న -రణబాలి- చిత్రాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రెండు చిత్రాలు దసరా కానుకగా ఒక్క రోజు గ్యాప్ లోనే విడుదలవుతుండటంతో సన్నివేశం ఆసక్తికరంగా మారుతోంది.

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న -జైలర్ 2- ( అక్టోబర్15) పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. మొదటి భాగంలో టైగర్ ముత్తువేల్ పాండ్యన్‌గా రజినీకాంత్ చూపించిన పవర్ ఫుల్ యాక్షన్ అండ్ మేనరిజమ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో సీక్వెల్‌లో రజినీకాంత్ పాత్ర ఎలా ఉండబోతోంది? యాక్షన్ ఎపిసోడ్స్ ఏ స్థాయిలో తెరకెక్కించారనే విషయంపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.మరోవైపు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న నటిస్తోన్న -రణబాలి-( అక్టోబర్ 16) చిత్రం కూడా అదే రేంజ్‌లో అంచనాలను పెంచేస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా పీరియాడికల్ యాక్షన్ డ్రామా స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కొన్ని చీకటి అధ్యాయాలు, యదార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటోంది.అయితే ఈ రెండు చిత్రాల ప్రమోషన్స్ కోసం ఎంచుకున్న వినూత్న వ్యూహం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. రెండు చిత్రబృందాలు టీజర్లు, ట్రైలర్లతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీల ద్వారా ప్రమోషన్లు నిర్వహించే ఒకే రకమైన స్ట్రాటజీని ఫాలో అవుతున్నాయి. ఇప్పటికే -జైలర్ 2- టీమ్ -జైలర్ 2 అన్‌లాక్డ్- పేరుతో విడుదల చేసిన స్పెషల్ డాక్యుమెంటరీ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలవగా.. -రణబాలి- బృందం కూడా ఏకంగా నాలుగు ఎపిసోడ్ల భారీ మేకింగ్ డాక్యుమెంటరీ సిరీస్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది.సినిమా వెనుక ఉన్న కష్టం, టెక్నికల్ విలువలు, లొకేషన్లు , నటీనటుల శ్రమను డాక్యుమెంటరీ రూపంలో నేరుగా ప్రేక్షకులకు చూపించడం వల్ల సినిమాపై మరింత కనెక్టివిటీ, విశ్వసనీయత పెరుగుతాయని నిర్మాతలు భావిస్తు న్నారు. సాధారణ ప్రచార చిత్రాల కంటే ఇలాంటి బిహైండ్-ది-సీన్స్ డాక్యుమెంటరీలు జాతీయ స్థాయిలో సినీ ప్రేమికులను ఆకట్టుకుంటూ సినిమా మేకింగ్ ప్రమాణాలను ఉన్నత స్థాయిలో నిలబెడుతున్నాయి.రెండు సినిమాల బాట ఒకటే కావడంతో సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పవర్ ఫుల్ మాస్ యాక్షన్ అంశాలతో -జైలర్ 2- వస్తుంటే? వైవిధ్యమైన చారిత్రక కథాంశంతో -రణబాలి- రేసులో ఉంది. మరి దసరా బరిలో ఎవరు విజేత అవుతారు? అన్నది చూడాలి.

అయితే ఈ రెండు సినిమాల ప్రభావం చాలా సినిమాలపై పడుతుంది. పండగ నేపథ్యంలో చాలా సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. దీంతో థియేటర్ల పరంగా ఇబ్బంది ఎదురవుతుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965